# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :147 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 14-08-2025 | పేజీలు:4 వెల: 2.00


## ప్రభుత్వానికి కోర్టు నోటీసులు

హైదరాబాద్, గోషామహల్ స్టేడియంలో ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం సరికాదంటూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గోషామహల్ స్టేడియంలో కొత్త భవనం నిర్మించి ఉస్మానియా ఆస్పత్రిని అక్కడికి తరలించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ రాము అనే వ్యక్తి హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. స్టేడియానికి చెందిన స్థలాన్ని ఆస్పత్రి కోసం బదలాయిస్తూ తీసుకున్న నిర్ణయం ఏకపక్షమని, పట్టణ ప్రాంతాల అభివృద్ధి చట్టాలకు విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఆ స్టేడియంలో పాఠశాల ఉందని, విద్యార్థులకు చెందిన ఆటస్థలంలో ఆస్పత్రి నిర్మాణం సరికాదన్నారు. ప్రస్తుతం మైదానం కూల్చివేత పనులు జరుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు–

## మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు సంచలన లేఖ



సిద్దిపేట జిల్లా, ఆగస్టు13: తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఇవాళ (బుధవారం) లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. వెంటనే కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్లు నింపాలని లేఖలో పేర్కొన్నారు హరీష్‌రావు. రిజర్వాయర్‌లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల రైతులు ఆందోళనలో ఉన్నారని చెప్పుకొచ్చారు. ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను వెంటనే నింపాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజ్–6 వద్ద మోటార్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని కోరారు హరీష్‌రావు.

అగ్రికల్చర్ అధికారులపై హరీష్‌రావు సీరియస్...

మరోవైపు.. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ గ్రామం వద్ద ఎరువుల కోసం క్యూలో బారులు దీరిన రైతులను చూసి హరీష్‌రావు ఆగిపోయారు. కేసీఆర్ హయాంలో హమాలీ ఖర్చులు ఇచ్చి ఇంటికి యూరియా పంపించామని గుర్తు చేశారు. ఉదయం నుంచి రైతులు వచ్చి ఇబ్బందులు పడుతుంటే పట్టించుకొనే అధికారి లేరని అగ్రికల్చర్ అధికారులపై సీరియస్ అయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మీడియాతో మాట్లాడారు. పదేళ్లలో లేని కొరత.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పుడు ఎందుకు వచ్చిందని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎరువుల కొరత మూమ్మాటికీ ఈ బీజేపీ , కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యమేనని విమర్శించారు. పదేళ్లలో కేసీఆర్ హయాంలో ఎరువుల ఇబ్బంది లేదని చెప్పుకొచ్చారు. ప్రతి మండలానికి గోదాంలు ఏర్పాటు చేసుకొని, వేసవి కాలంలోనే ఎరువులు స్టాక్ పెట్టామని గుర్తుచేశారు. ఏ గ్రామంలో ఎరువులు ఆ గ్రామంలోనే రైతులకు అందించామని వెల్లడించారు. గ్రామం నుంచి రైతు కాలు బయటపెట్టకుండా హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ ఖర్చు లేకుండా రైతు సమయం వృథా కాకుండ గ్రామంలోనే ఎరువులు అందిచామని తెలిపారు. నాలుగు రోజుల నుంచి ఇక్కడికి వచ్చి ఉంటే ఒక్క లారీ ఒక్క బస్తా ఇస్తామని చెప్పడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు దర్శనం దొరుకుతుంది కానీ ఎరువుల బస్తా దొరకడం లేదని మహిళా రైతు భాగ్యమ్మ చెప్పడం ఈ ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపునకు నిదర్శనమని ఆక్షేపించారు హరీష్‌రావు .

ఓటీపీ విధానం తీసేయాలి...

వెంటనే ఓటీపీ విధానం, ఒక బస్తా విధానాన్ని తీసేయాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఓటీపీ పేరిట రేవంత్ ప్రభుత్వం రైతులను వేధిస్తోందని విమర్శించారు. రైతుల అవసరాల అనుగుణంగా ఎరువుల బస్తాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మళ్లీ పాత రోజులు వచ్చాయని.. ఇదేనా కాంగ్రెస్ మార్పు అని నిలదీశారు. బీజేపీ రైతు వ్యతిరేక ప్రభుత్వం, నానో యూరియా వాడాలని చెప్పడం రైతులపై రూ.500 అదనపు భారం వేయడమేనని మండిపడ్డారు. నానో యూరియాతో రైతులకు ఎకరానికి రూ. 500 భారం పడుతుందని వాపోయారు. ప్రభుత్వం సబ్సిడీ నుంచి తప్పించుకోడానికి కృత్రిమ ఎరువులను సృష్టిస్తోందని ఆరోపించారు. ఎన్నికలు ఉన్నాయని బీహార్‌కు ఎరువులను తరలిస్తున్నారని విమర్శించారు హరీష్‌రావు .

బీజేపీ ఎంపీలు విఫలం...

తెలంగాణలో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచి రాష్ట్రానికి ఎరువుల కొరత తీర్చడంలో విఫలం అయ్యారని హరీష్‌రావు ఫైర్ అయ్యారు. ఇద్దరు కేంద్రమంత్రులు తెలంగాణలో ఉండి ఎరువుల కొరతపై నోరు మెదపడం లేదని రైతుల ఉసరు ఉట్టిగా పోదని హెచ్చరించారు. 4 రోజుల నుంచి వ్యసాయ పనులు వృథా చేసుకొని రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. సీం రేవంత్‌రెడ్డి 51 సార్లు ఢిల్లీకి పోయారు కానీ ఎరువుల కొరత ఎందుకు తీర్చలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తిట్లు ఎక్కువ.. పని తక్కువ అని కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డికి తిట్ల మీద ఉన్న ధ్యాస.. పని మీద లేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఎరువులు ఎలా వచ్చాయి.. కాంగ్రెస్ హయాంలో ఎందుకు రావు అని ప్రశ్నించారు. వెంటనే ఓటీపీ, ఒక్క బస్తా విధానాన్ని తొలగించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## పర్యావరణాన్ని రక్షిస్తే తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తాం



న్యూఢిల్లీ, కంచ గచ్చిబౌలి అడవుల నరికివేతపై సుప్రీం కోర్టులో విచారణ. సెంట్రల్ యూనివర్సిటీ భూముల్లో అడవుల నరికివేతను సుమోటోగా విచారించిన సుప్రీం కోర్ట్.పర్యావరణాన్ని, వన్య ప్రాణులను రక్షించేలా ప్రతిపాదనలు రెడీ చెయ్యాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించారు. గతంలో కంచ గచ్చిబౌలి వ్యవహారంలో సుప్రీం కోర్ట్ కీలక వ్యాఖ్యలు చేసింది. అభివృద్ధి కోసం రాత్రికి రాత్రి వందల బుల్డోజర్లతో అడవులను నాశనం చేస్తారా అంటూ సుప్రీం కోర్ట్ మండిపడింది. అంతేకాదు వెంటనే విధ్వంసం ఆపేయాలని ఆదేశించింది. పర్యావరణాన్ని కాపాడకపోతే కంచె గచ్చిబౌలి లోనే తాత్కాలిక జైలు నిర్మించి, సిఎస్ తో పాటూ అధికారులను పెట్టాల్సి వస్తుందని చీఫ్ జస్టిస్ బి ఆర్ గవాయ్ హెచ్చరించారు.రాష్ట్రప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు సీనియర్ అడ్వకేట్ అభిషేక్ మనుసింఘ్వీ. అడవుల పరిరక్షణపై ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు సింఘ్వి.. అడవులు, చెరువులు, వన్యప్రాణుల రక్షణ కోసం విస్తృత ప్రణాళికను రెడీ చేస్తాం అన్నారు అభిషేక్ సింఘ్వి. పర్యావరణ పరిరక్షణ కోసం మంచి ప్రతిపాదనను సిద్ధం చెయ్యాలని.. అలా చేస్తే గతంలో చేసిన కామెంట్స్‌ను ఎత్తివేసి కాంప్లిమెంట్ ఇస్తామన్నారు చీఫ్ జస్టిస్.

## కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాలి..



హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమై, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ విపత్కర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు వర్ష బాధితులకు అండగా నిలవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి, ప్రజలకు అండగా నిలవాలన్నారు కేటీఆర్.ఇప్పటికే అన్ని రంగాల్లో విఫలమైన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నా, లేకపోయినా.. ప్రతిపక్షంగా మన బాధ్యత ఎక్కువని గుర్తుచేస్తూ, బీఆర్ఎస్ కార్యకర్తలు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. అత్యవసర వైద్య అవసరాల కోసం కూడా అవసరమైన చోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అలాగే, వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద నీరు నిలిచిన ప్రాంతాలకు వెళ్లవద్దని హెచ్చరించారు. ముఖ్యంగా వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో ఇప్పటికే వరద వలన తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు ప్రభుత్వ వైఫల్యం వలన ఇబ్బందులు పడుతుండడం పైన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జిల్లాలకు చెందిన పార్టీ లీడర్లు శ్రేణులు సహాయక చర్యల్లో మరింత చొరవ చూపాలన్నారు. ఈ మేరకు ఆ మూడు జిల్లాల పార్టీ నేతలతో కేటీఆర్ మాట్లాడారు. ఈ కష్టకాలంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, పార్టీ ప్రజలకు అండగా ఉంటుంది. అందరూ ధైర్యంగా ఉండాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

## వర్షాల్లో వైద్య సేవలు నిరవధికంగా కొనసాగించండి..



హైదరాబాద్,ఆగస్టు13: తెలంగాణ రాష్ట్రానికి ఇవాళ నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షసూచన ఉన్నందున ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరన్స్ నిర్వహించారు. హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు, ఆర్ఎంవోలు, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది ఈ మూడు రోజులు కచ్చితంగా హాస్పిటల్స్ లోనే ఉండాలని.. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు మంత్రి దామోదర రాజనర్సింహ.అందరి సెలవులు రద్దు చేయాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు, గర్భిణులకు తక్షణమే వైద్య సేవలు అందించాలని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్ దగ్గరగా ఉన్న గర్భిణులను హాస్పిటల్స్‌లోని బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించి సేవలు అందించాలని మార్గనిర్దేశం చేశారు. అంబులెన్స్‌లు, 102 వాహనాలు అన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, ఎక్కడ ఎమర్జెన్సీ ఉన్నా తక్షణమే వెళ్లి పేషెంట్‌ను తరలించేలా డ్రైవర్లు, ఈఎంటీలను 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలని మార్గ నిర్దేశం చేశారు మంత్రి దామోదర రాజనర్సింహ.హాస్పిటళ్లలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, కరెంట్ పోయిన మరుక్షణమే జనరేటర్స్ ఆన్ చేసి రోగులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎలక్ట్రీషన్లను 24 గంటలు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో హాస్పిటల్స్ లోపలకు నీరు చేరకుండా, నిల్వ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులంతా ఈ మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ దిశానిర్దేశం చేశారు.

## మోడీ ముందు ఎన్నో సవాళ్లు !



న్యూఢిల్లీ,కేంద్రంలో మూడవసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన నరేంద్ర మోడీకి ఈసారి అంత సవ్యంగా సాఫీగా సాగేలా కనిపించడం లేదు అని అంటున్నారు. బీజేపీకి మెజారిటీ సొంతంగా లేదు. మిత్రుల ఆసరాతో కేంద్ర ప్రభుత్వం నడపాలి. అది తొలి సవాల్. పైగా రాజకీయంగా ఎంతో విశేష అనుభవం ఉన్న చంద్రబాబు నితీష్ కుమార్ లను పక్కన పెట్టుకుని ప్రభుత్వం నడపడం కూడా కత్తి మీద సాము లాంటిది. అయితే ఇప్పటికి అయితే ఈ ఇద్దరు మిత్రుల నుంచి ఎలాంటి ఇబ్బంది ఎదురు కాలేదు. కానీ రాజకీయ వాతావరణం జాతీయ స్థాయిలో నెమ్మదిగా మారిన వేళనే ఎన్డీయే మిత్రుల స్టాండ్ వారి వ్యూహాలు ఏంటో తెలుస్తాయన్న చర్చ ఉండనే ఉంది.

అటు ఆర్ఎస్ఎస్ అలా :

బీజేపీకి రాజకీయ గురువు మార్గదర్శి అయిన ఆర్ఎస్ఎస్ మోడీ మీద పరోక్షంగా ఒత్తిడి పెడుతోంది. ఏడున్నర పదుల వయసు నిండిన వారు రాజీనామాలు చేయాల్సిందే రాజకీయాల నుంచి తప్పుకోవాల్సిందే అని ఆర్ఎస్ఎస్ భారీగానే సూచనలు చేస్తోంది. ఇదంతా మోడీని దృష్టిలో పెట్టుకునే అని అంటున్నారు. ఇక చూడబోతే ఒక్క నెల మాత్రమే ఉంది. మోడీ 75 ఏళ్ళు నిండి 76వ ఏటలోకి అడుగు పెట్టడానికి. మరో వైపు చూస్తే రాజకీయంగా అనేక సవాళ్ళు ఎదురవుతున్నాయి. రాహుల్ గాంధీ అనూహ్యంగా విపక్షం నుంచి పుంజుకుంటున్నారు. తన బలమైన వాయిస్ ని వినిపిస్తున్నారు.

రాజకీయ రచ్చగానే :

తప్పుడు ఓట్లు ఫేక్ ఐడీలు ఈసీ సాయం ఇలా రాహుల్ గాంధీ కేంద్రంలోని బీజేపీతో ఈసీని ముడి పెట్టి చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ఈ రోజున దేశంలో అది హాట్ టాపిక్ అయింది. ఈసీ తప్పుడు పద్ధతులు అనుసరించి బీజేపీకి సాయం చేసింది అని ఓట్ల చోరీ అని రాహుల్ అండ్ కో గొంతు పెంచుతున్నారు. దానిని ఎలా ఎదుర్కోవాలో ఈసీకి పాలుపోవడం లేదు. అదే సమయంలో బీజేపీ సాధించిన విజయాల వెనక మోడీ ఇమేజ్ కాకుండా ఈ తరహా వ్యూహాలు ఉన్నాయా అన్న చర్చ అయితే జనంలోకి గట్టిగా వెళ్లేలా ఇండియా కూటమి తీవ్రతరమైన ప్రచారాన్ని చేసింది.

బీహార్ తో సీన్ మారుతుందా :

ఇక చూస్తే కేవలం రెండు మూడు నెలల వ్యవధిలో బీహార్ ఎన్నికలు ఉన్నాయి. ఈ ఎన్నికల ముందే ఇలా ఈసీ విశ్వసనీయతను బీజేపీ రాజకీయ ప్రతిష్టను దెబ్బ తీసేలా విపక్షం మొత్తం ఎలుగెత్తి చాటుతోంది. చేయాల్సిన విమర్శలు అన్నీ చేస్తోంది. దాంతో ఏమి జరుగుతుంది అన్నదే ఇపుడు అందరి మదిలో ఉంది. బీహార్ లో కనుక ఎన్డీయే కూటమి ఓటమి పాలు అయితే కనుక అసలైన కష్టాలు కేంద్రంలోని ఎన్డీయే కూడా మొదలవుతాయా అన్నది కూడా ఉంది.

గాలి మారితే తీరు మారుతుందా :

దేశంలో గాలి రాజకీయంగా మారితే దాని ప్రభావం కచ్చితంగా ఎన్డీయే కూటమి మీద పడుతుంది అని అంటున్నారు. మిత్రులు కూడా అపుడు ఏ విధంగా ఆలోచిస్తారు మరే విధంగా రియాక్ట్ అవుతారు అన్నది కూడా చూడాల్సి ఉంది అని అంటున్నారు. మరో వైపు చూస్తే అంతర్జాతీయంగా కూడా భారత్ ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ మీద పగబట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. రష్యాతో ఇబ్బంది లేకపోయినా చైనాతో మాత్రం భారత్ చెలిమి అంత విశ్వసనీయంగా ఉంటుందా అన్న చర్చ ఉండనే ఉంది.ఇవన్నీ కూడా మోడీ గడచిన పదకొండేళ్ళుగా చూడని సవాళ్ళుగా మారబోతున్నాయని అంటున్నారు. పక్కలో బల్లెంగా పాక్ ఉంటే దానికి పాలు పోసేందుకు అమెరికా సిద్ధంగా ఉంటే ఆ పరిణామాలు కూడా ఏ మలుపు తిరుగుతాయన్నది కూడా చూడాల్సి ఉంది అని అంటున్నారు. మొత్తానికి నరేంద్ర మోడీకి ఇంటా బయటా సమస్యలు అయితే పొంచి ఉన్నాయని అంటున్నారు. వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తే మోడీ అజేయుడే అని స్పష్టంగా అంతా ఒప్పుకుంటారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## కర్ణాటక రాష్ట్రంలోని ధర్మస్థల తవ్వకాలో కీలక మలుపు



బెంగళూర్ :కర్ణాటకరాష్ట్రంలోని ధర్మస్థల ఉదంతం రోజుకో మలుపు తిరుగుతున్నది. దేశంలోనే సంచలన కేసుగా మారిన ఈ ఉదంతం పలు కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.కొన్ని సంవత్సరాలుగా ఆడపిల్లలు, బాలికల పట్ల అత్యంత క్రూరంగా అత్యాచారం చేస్తూ, హతమారుస్తున్న వైనం యావత్ దేశాన్నే కదిలిస్తోన్న ఘోర ఘటన ఇది. డబ్బు, అధికారం,సమాజంలో తమకున్న పేరుబలంతో ఏం చేసినా పర్వాలేదు అనుకుంటూ, అమ్మాయిల జీవితాలతో ఆడుకుంటున్న ధర్మస్థల నిందితులు ఇక తప్పించుకోలేరు. త్వరలోనే వారంతాన్యాయస్థానం ముందు నిలబడే రోజు వస్తుంది. డ్రోన్ ఆధారిత జీపీఆర్ టెక్నాలజీతో వర్షంలో అన్వేషణ కొనసాగుతున్నది. మాజీ పారిశుద్ధ కార్మికుడు భీమా చూపిన ప్రదేశాల్లో నేత్రావతి నది పరివాహకంలో కీలకమైన 13వ నెంబర్ సైట్ వద్ద పరిశోధన తవ్వకాలు కొనసాగిస్తున్నారు. భూమిలోపల మృతదేహాల అవశేషాలు గుర్తించేందుకు (జిపిఆర్) గ్రౌండ్ పెనట్రేటింగ్ రేడార్ని దించింది ప్రత్యేక దర్యాప్తు బృందం. జీపీఆర్తో భూమిలోకి సిగ్నల్స్ పంపి సెన్సర్ల ద్వారా వచ్చే డేట రికార్డ్ చేయనుంది. నదీపరివాహక ప్రాంతంలోభూమిలోపల ఉన్న ఎలాంటి వస్తువైనా ఈ టెక్నాలజీ గుర్తిస్తోంది.

13వ సైట్లో 8 మృతదేహాలు ఖననం

కాగా విజిల్బ్లోయర్ వాంగ్మూలంతో జిపిఆర్ వినియోగంతో ధర్మస్థలంలో సంచలనాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. బాహుబలి విగ్రహం ఉన్న రత్నగిరి బెట్టకు 200 మీటర్ల దూరంలో వర్షంలోనే తవ్వకాలు కొనసాగిస్తున్నారు. అయితే రత్నగిరిబెట్ట సమీపం ప్రాంతాల్లో ఎక్కడి నుంచో తెచ్చి కొత్తగా మట్టి పోసినట్లుగుర్తించింది సిట్. కొత్తగా మట్టి పోయించాల్సిన అవసరం ఏమిటనం తహశీల్దారుకు సిట్ నోటీసులు ఇచ్చింది. మట్టి పోసిన విషయం తమకు తెలియదని అధికారులు చెప్పటంతోఅనుమానాలను వ్యక్తం చేస్తోంది సిట్.

ఆత్మీయుల కుటుంబాల్లో పెరుగుతున్న ఉత్కంఠ

కాగా అదృశ్యమైన ఆత్మీయుల కుటుంబాల్లో ఉత్కంఠ పెరుగుతోంది. కనీసం అయినవాళ్లయినా దొరుకుతాయేమోనని చిన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 38 ఏళ్లక్రితం జరిగిన ఓ విద్యార్థిని హత్యపై పునర్విచారణ కోరుతూ సిట్ని ఆశ్రయించింది ఆమె సోదరి. 1995 నుంచి 2014 మధ్య వందల సంఖ్యలో మహిళలు, విద్యార్థినుల మృతదేహాలను గుట్టుచప్పుడు కాకుండా ఖననం చేశానని అప్పట్లో శానిటేషన్ కార్మికుడిగా పనిచేసిన వ్యక్తి జూన్ 3న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విజిల్ బ్లోయర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు తవ్వకాలు చేపట్టారు. ఇప్పటిదాకా 16 వేర్వేరు ప్రదేశాల్లో తవ్వకాలు జరిగాయి.

### శంషాబాద్‌లో ఖరీదైన గంజాయి పట్టివేత

హైదరాబాద్,శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఖరీదైన గంజాయిని డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికురాలి వద్ద నుంచి రూ.13.3 కోట్లు– విలువైన హైడ్రోఫోనిక్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మహిళను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## తెలంగాణపై కేంద్రం వివక్షత చూపుతోంది..



హైదరాబాద్,తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన వివరించిన ప్రకారం, ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ప్రాజెక్ట్ కోసం తెలంగాణ ప్రభుత్వం అన్ని అవసరమైన అనుమతులు ఇప్పటికే జారీ చేసింది. రాష్ట్రం ప్రైమ్ లోకేషన్‌లో 10 ఎకరాల స్థలం కూడా కేటాయించింది.అయితే, అదే ప్రాజెక్ట్ కోసం ఏపీ ఒక ఎకరా కూడా కేటాయించకపోయినప్పటికీ, కేంద్రం ఆ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఆయన పేర్కొన్నట్లుగా, రాజకీయ భావాలతో తీసుకోబడిన నిర్ణయాలు తెలంగాణ రాష్ట్రానికి అవమానకరంగా ఉంటాయి. మంత్రివర్గంలోని ఈ వ్యాఖ్యలు, కేంద్రం విధానాలపై తెలంగాణ ప్రభుత్వ అసంతృప్తిని స్పష్టంగా చూపిస్తున్నాయి.“ఇలాంటి కేంద్ర విధానాలను తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదు.

## సంపాదకీయం

గురువారం 14-08-2025

# పర్యావరణ పరిరక్షణలో బ్రిక్స్ నెగ్గుకురాగలదా?

భౌగోళిక, రాజకీయ విభేదాలు పెచ్చుమీరడంతో అంతర్జాతీయంగా బహుళపక్ష సంస్థలు బలహీనపడ్డాయి. మరోవైపు పర్యావరణ సంక్షోభం ముంచుకొస్తోంది. ఇలాంటి తరుణంలో వాతావరణ మార్పులను తక్షణం నివారించాల్సి ఉన్నా, అమెరికా తదితర పాశ్చాత్య దేశాలు కాడి కిందపడేస్తున్నాయి. దాంతో ఆ బాధ్యతను తలకెత్తుకోవడానికి సిద్ధమని ఇటీవల బ్రెజిల్‌లో జరిగిన 17వ శిఖరాగ్ర సభలో బ్రిక్స్ ప్రకటించింది. ఈ విషయంలో అది ఎంతవరకు సఫలీకృతమవుతుంది? బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికాలతో కూడిన బ్రిక్స్‌లో ఇరాన్, ఇథియోపియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఇండోనేసియా కూడా చేరాయి. 'బ్రిక్స్ ప్లస్'గా వ్యవహరిస్తున్న ఈ పది దేశాల్లో 45శాతం ప్రపంచ జనాభా నివసిస్తోంది. 35శాతం ప్రపంచ జీడీపీ బ్రిక్స్ ద్వారానే సమకూరుతోంది. అయితే, కర్బన ఉద్గారాల్లో సగం ఈ దేశాల నుంచే వెలువడుతున్నాయి. వీటిని తగ్గించడానికి బ్రిక్స్ కట్టుబడి ఉన్నప్పటికీ- సంపన్న, చమురు ఉత్పత్తి దేశాలు పూర్తిగా కలసిరావట్లేదు. ప్రపంచ సమస్యల పరిష్కారానికి దేశాలన్నీ కలసికట్టుగా కృషిచేయాలనే బహుళపక్ష వాదం క్రమంగా బలహీనపడిపోతోందంటూ రియో డి జనైరోలో బ్రిక్స్ సభను ప్రారంభిస్తూ బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనేసియో లులా డ సిల్వా వ్యక్తం చేసిన ఆవేదనలో వాస్తవముంది. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ సంక్షోభం, పేదరికం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్న వేళ- వాటిని పరిష్కరించాల్సిం దిపోయి యుద్ధానికి అమూల్యమైన నిధులను మళ్లించడం అన్యాయమే.

వర్ధమాన దేశాలకు వారధిగా...

బ్రిక్స్ సంయుక్త ప్రకటన ఏఐ నిర్వహణ, స్వీయ వాణిజ్య రక్షణ ధోరణులు, పాలస్తీనా సమస్యలను ప్రస్తావించింది. ఇరాన్‌పై దాడులను ఖండించింది. అన్నింటినీ మించి వాతావరణ మార్పుల గురించి ప్రత్యేక శ్రద్ధ కనబరచింది. వర్ధమాన దేశాలు ఈ మార్పులను తట్టుకోవడానికీ, వాటివల్ల ఇప్పటికే జరిగిన నష్టం నుంచి తేరుకోవడానికీ 2035కల్లా ఏటా 1.3లక్షల కోట్ల డాలర్లను కేటాయించాలన్న డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ముదురుతున్న నేపథ్యంలో బ్రిక్స్ కొత్త రాజకీయ, ఆర్థిక వ్యూహాలను రచించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. వాతావరణ మార్పుల నిరోధానికి హరిత ఇంధనాలతో వాహనాలను, పరిశ్రమలను నడపడం అనివార్యమవుతోంది. 2024లో మొత్తం ప్రపంచ సౌర విద్యుదుత్పాదనలో బ్రిక్స్ దేశాల వాటా 51శాతం. అమెరికా 303 టెరావాట్ అవర్ల సౌర విద్యుదుత్పాదన సాధిస్తే, చైనా అంతకు మూడింతలుగా 835 టెరావాట్ అవర్ల సౌరశక్తిని ఉత్పత్తి చేసింది. భారత్ 133, బ్రెజిల్ 75 టెరావాట్ అవర్ల సౌర విద్యుత్తును ఉత్పత్తి చేశాయి. ఈ ఏడాది చైనాలో సౌరవిద్యుదుత్పాదన 42శాతం అధికమైతే, బ్రెజిల్‌లో 35, భారత్‌లో 32శాతం చొప్పున పెరిగింది. 2023 నుంచి అంతర్జాతీయ హరిత ఇంధన ప్రాజెక్టుల్లో చైనా పదివేల కోట్ల డాలర్ల మేర పెట్టుబడి పెట్టింది. వర్ధమాన దేశాల మధ్య ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి, జీవ ఇంధనాల రంగాల్లో సహకారం విస్తరిస్తోంది. శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గించి, హరిత ఇంధనాలతో స్వావలంబన సాధించాలనే చైతన్యమూ ఆ దేశాల్లో పెరుగుతోంది.ప్రస్తుతం హరిత ఇంధనాలవైపు పయనంలో భారత్ ముందుంది. వచ్చే ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సభ మన దేశంలోనే జరుగుతుంది. అంతర్జాతీయ సహకారంలోనూ ఇండియా కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ సౌరశక్తి కూటమి, ప్రకృతి ఉత్పాతాలను తట్టుకోగల మౌలిక వసతుల నిర్మాణ కూటమిలో భాగస్వామిగా ఉన్న భారత్- సాంకేతికతను వాతావరణ మార్పుల నిరోధానికి ఉపయోగించే పథకాన్ని(బీఐటీసీ) కూడా చేపట్టింది. వందకు పైగా సభ్యదేశాలు ఉన్న అంతర్జాతీయ సౌరశక్తి కూటమి ఆసియా, ఆఫ్రికా, పసిఫిక్ ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్రాజెక్టులకు తోడ్పడుతోంది. బీఐటీసీ వర్ధమాన దేశాలకు వాతావరణ మార్పుల నిభాయింపు సాంకేతికతలను అందిస్తోంది. తుర్కియే, మొజాంబిక్, ఫిజీలలో ప్రకృతి ఉత్పాతాలు సంభవించినప్పుడు భారత్ పెద్దయెత్తున మానవతా సాయం అందించింది. రియో బ్రిక్స్ సభలో భారత్, చైనాలు ఉష్ణమండల అరణ్యాల సంరక్షణ ఆవశ్యకతను ముక్తకంఠంతో చాటిచెప్పాయి. కర్బన ఉద్గారాలపై ఏకాభిప్రాయం ప్రకటించాయి. ఈ ఏడాది నవంబరులో బ్రెజిల్‌లోని బెలెమ్‌లో జరిగే కాప్-30 సభ కర్బన ఉద్గారాల పరిహరణపై దృష్టి కేంద్రీకరించనుంది. ఆ సందర్భంగా వర్ధమాన దేశాల వాణిని భారత్, చైనాలు బలంగా వినిపించాలి.

పకడ్బందీ కార్యాచరణే కీలకం

బ్రిక్స్‌కు పెద్ద ఆశయాలున్నా, రియో సభలో అంతర్గత వైరుధ్యాలూ బయటపడ్డాయి. శిలాజ ఇంధనాల వినియోగాన్ని ఖండించకపోవడం, హరిత ఇంధనాలకు మారేవరకు కర్బన మార్కెట్లను ఉపయోగించాలని తీర్మానించడం బ్రిక్స్ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేసింది. పైగా శిలాజ ఇంధనాల వాడకానికి ఎప్పటినుంచి ముగింపు పలకాలనేది నిర్ణయించలేదు. వాతావరణ మార్పులకు అతలాకుతలమవుతున్న ద్వీపదేశాలకు, పేద దేశాలకు నష్టనివారణ నిధులు అందించడంపై చర్చించకపోవడం పెద్ద లోపం. హరిత ఇంధనాలను ప్రోత్సహించడానికి బాండ్లను విడుదల చేయాలని నిశ్చయించారు. కానీ, వాటి విక్రయానికి ప్రైవేటు మదుపరులపైనా, సంపన్న దేశాలపైనా ఆధారపడటం వర్ధమాన దేశాలకు ఉపకరించదు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి ధనిక దేశాలు భారీగా నిధులిస్తేనే కానీ వర్ధమాన దేశాలు గండం గట్టెక్కలేవు. బ్రిక్స్ సభ గంభీర ప్రకటనలు చేయడమే తప్ప పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికను అమలులో పెట్టలేకపోయింది. కాబట్టి, ఈ ఏడాది నవంబరులో బెలెమ్‌లో జరిగే కాప్-30 సభలోనైనా బ్రిక్స్ నిర్దిష్ట కార్యాచరణను చేపట్టాలి. అంతర్గత విభేదాలను పరిష్కరించుకుని పాశ్చాత్య దేశాలకు ప్రత్యామ్నాయంగా నిలిచే సత్తా తమకు ఉందని ఈ కూటమి నిరూపించుకోవాలి. శిలాజ ఇంధనాలను విడనాడటానికి స్పష్టమైన గడువు ప్రకటించాలి. వర్ధమాన దేశాలకు వాతావరణ నిధులను ప్రైవేటు రుణాలు, బాండ్ల రూపంలో కాకుండా గ్రాంట్ల రూపంలో ఇవ్వాలి. వాతావరణ మార్పుల నిరోధం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలి.

# అక్షరాలపై ఆంక్షల ఆయుధాలా!



న్యూఢిల్లీ,భారత దేశ సార్వభౌమాధికారం, సమగ్రత ప్రమాదంలో పడేలా ఉగ్రవాదాన్ని, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించడమేకాక, తప్పుడు కథనాలతో యువతను పెడదారి పట్టిస్తున్నాయన్న ఆరోపణలతో జమ్మూకశ్మీర్‌లోని కేంద్రపాలిత ప్రభుత్వం 25 పుస్తకాలపై నిషేధం విధించింది. భారతీయ న్యాయ సంహిత 2023 లోని సెక్షన్లు, 152, 196, 197 లోని నిబంధనలను ఈ 25 పుస్తకాలకు అన్వయింప చేస్తూ నిషేధాన్ని అమలులోకి తెచ్చింది. ఇది భావవ్యక్తీకరణ, ప్రచురణ స్వేచ్ఛపై ఉక్కుపాదం మోపడమే. ఇది అక్షరాలపై ఆంక్షల ఆయుధాన్ని ప్రయోగించడమే. పుస్తకాలను నిషేధించడం వల్ల చరిత్ర చెరిగిపోతుందా? అది విభజనను మరింత పెంచుతుందన్న తీవ్రవ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ పరిస్థితిపై దృష్టి కేంద్రీకరించి పుస్తకాలను రచించిన దేశ విదేశీ రచయితలు ఈ నిషేధ జాబితాలో ఉన్నారు. బుకర్‌ప్రైజ్ విజేత అరుంధతీరాయ్, ప్రముఖ రచయితలు ఎజి నూరానీ, విక్టోరియా స్కోఫీల్డ్, సుమంత్రబోస్, డేవిడ్ దేవదాస్, అనూరాధ భాసిన్, అయేషా జలాల్ తోపాటు పలువురి పుస్తకాలపై నిషేధాన్ని ప్రకటించారు. ఈ పుస్తకాలు ఉగ్రవాదాన్ని భారత్‌పై హింసను ప్రేరేపించడంలో కీలక పాత్ర పోషిస్తుండటంతో యువత దారి తప్పుతోందని నిఘా వర్గాలనుంచి సమాచారం అందడంతో ఈ పుస్తకాలను నిషేధిస్తున్నామని జమ్మూకశ్మీర్ హోంశాఖ గత బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ పుస్తకాలు ఏవిధంగా హింసను ప్రేరేపిస్తున్నాయో నిరూపించే సంఘటనలేవీ ప్రస్తావించకపోవడం గమనార్హం. హోం శాఖ ఆదేశాల ప్రకారం జమ్మూకశ్మీర్ పోలీసులు పుస్తకాల దుకాణాల్లో సోదాలు నిర్వహించి పుస్తకాలను జప్తు చేశారు.నిషేధించిన పుస్తకాల్లో ఏముందని పరిశీలిస్తే.. అరుంధతీ రాయ్ 2018 నుంచి 2020 మధ్యకాలంలో 'భారత ప్రజాస్వామ్యానికి ఇది చీకటి కాలమని, మెజారిటీవాదం, మతోన్మాదం పెరుగుతుండడం దేశానికి అత్యంత ప్రమాదకరమని తాను అనేక వ్యాసాలు, ఉపన్యాసాల్లో హెచ్చరించారు. అవన్నీ ఆజాదీ పేరున సంకలనంగా వెలువడ్డాయి. ఆ ఆజాదీయే నిషేధానికి గురైంది. రాజ్యాంగ నిపుణుడైన ఎజి నూరానీ రాసిన 'ది కశ్మీర్ డిస్ప్యూట్ ' :1947 2012' దీర్ఘకాల కశ్మీర్ సమస్య సంక్లిష్ట చరిత్రను, దానితో చెలరేగిన రాజకీయ అసంతృప్తిని వివరిస్తుంది. బ్రిటిష్ రచయిత్రి, చిత్రకారిణి విక్టోరియా స్కోఫీల్డ్ రాసిన 'కశ్మీర్ ఇన్ కాన్‌ఫ్లిక్ట్' ఇండియా, పాకిస్థాన్ అండ్ ది అన్‌ఎండింగ్ వార్', జర్నలిస్ట్, కశ్మీర్‌టైమ్స్ ఎడిటర్ అనురాధా బాసిన్ రాసిన 'ది డిస్మాంటిల్డ్ స్టేట్ : ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ కశ్మీర్ ఆఫ్టర్ 370', కంటెస్టెడ్ ల్యాండ్స్ ఆర్టికల్ 370 రద్దు తరువాత జమ్మూకశ్మీర్‌లోని ప్రజల జీవితాలు, స్థానిక రాజకీయ, సామాజిక రంగాలపై ఆ ప్రభావం ఎలా ఉందో వివరిస్తుంది. డేవిడ్ దేవదాస్ రాసిన 'ఇన్‌సెర్చ్ ఆఫ్ ఎ ఫ్యూచర్' ది స్టోరీ ఆఫ్ కశ్మీర్ కూడా ఆ కోవకు చెందినదే.మొత్తం మీద ఈ పుస్తకాలన్నీ కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు, విధ్వంసాలు, అక్కడి దశాబ్దాల రాజకీయ ప్రస్థానం ప్రతిబింబిస్తాయి. ప్రభుత్వంపై అసమ్మతిని ఉక్కుపాదంతో అణగదొక్కడానికి ఇప్పటికే దేశమంతటా సెన్సార్ షిప్‌ను ఒక ఆయుధంగా వినియోగించుకుంటున్నారు. దీనికి తోడు 2019 తరువాత జమ్మూకశ్మీర్‌లో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తన మందబలంతో రచయితల కలాలకు సంకెళ్లు వేయవచ్చు. కానీ కశ్మీర్ చరిత్ర పుస్తకాలలో మాత్రమే లేదు. అది ప్రజల జ్ఞాపకాలలో ఉంది. ఆ జ్ఞాపకాలు చెరిపేస్తే చెరిగిపోవు. తరతరాలు కొనసాగుతుంటాయి' అని రచయితలు వ్యాఖ్యానిస్తున్నారు. 'నా పుస్తకంలో ఎక్కడా ఉగ్రవాదాన్ని ప్రశంసించే ప్రసక్తే లేదు. ప్రభుత్వాల పాలనా వైఖరిని విమర్శించడం తప్ప. మరి ఈ రెండిటికీ తేడా ఏమిటో అధికారులు గమనించడం లేదు.ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి' అని ప్రముఖ ఎడిటర్ అనూరాధ బాసిన్ ఆందోళన వ్యక్తం చేశారు. సెన్సార్ షిప్ సంఘటనలు ప్రపంచానికి, దేశానికి ముఖ్యంగా కశ్మీర్‌కు కొత్తేమీ కాదు. పుస్తకాలను నిషేధించి భావవ్యాప్తికి అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు గతంలో కూడా జరిగాయి. 1910 లో బ్రిటిష్ పాలకులు మహాత్మాగాంధీ రాసిన హింద్ స్వరాజ్ పుస్తకం గుజరాతీ ఎడిషన్‌ను రాజద్రోహంగా ఆరోపిస్తూ నిషేధించారు. 1933 మేలో నాజీ విద్యార్థులు జర్మన్‌వి కావన్న ద్వేషంతో వేలాది పుస్తకాలను తగులబెట్టారు. 1904లో మున్షీ ముహమ్మద్ దిన్ ఫౌక్ శ్రీనగర్‌లో ఒక వార్తా పత్రికను ప్రచురించడానికి ప్రయత్నించారు. దీనికోసం అప్పటి డోగ్రా పాలకుడు మహారాజా ప్రతాప్ సింగ్ అనుమతి కోరారు.దీనికి అనుమతి లభించలేదు. అంతేకాదు భవిష్యత్తులో అలాంటి అభ్యర్థనలను స్వీకరించకుండా నిబంధనలను కట్టుదిట్టం చేయాలని మహారాజా ప్రతాప్ సింగ్ తన ప్రధాన మంత్రిని ఆదేశించారు. 2010లో 17 ఏళ్ల విద్యార్థి తుఫైల్ చుట్టూ హత్య తరువాత భారీ ఎత్తున నిరసన జ్వాలలు చెలరేగడంతో ప్రభుత్వం ఎస్ఎంఎస్ సేవలను నిషేధించింది. మూడేళ్ల తరువాత కానీ ఆ సేవలను పునరుద్ధరించలేదు. 2016 లో కశ్మీర్‌లో తిరుగుబాటు తీవ్ర స్థాయిలో ఉన్నప్పుడు శ్రీనగర్‌లోని ఇండిపెండెంట్ పత్రిక అయిన కశ్మీర్ రీడర్‌ను ప్రభుత్వం నిషేధించింది. ఈ పత్రిక హింసను ప్రేరేపిస్తోందని ఆరోపించింది. కశ్మీర్‌లో ప్రభుత్వ పాలనా యంత్రాంగంలోని లోపాలను ధైర్యంగా ఎత్తి చూపే నిజాయితీగల జర్నలిస్టులకు నిర్బంధాలు నిత్యం పరిపాటిగా జరుగుతున్నవే. ఆ ధోరణి 2019 నుంచి మరింత పెచ్చుమీరడం శోచనీయం.

# ఇసీపై నమ్మకం కల్పించడమే కర్తవ్యం

న్యూఢిల్లీ,ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశంగా భారతదేశం ఖ్యాతిని పొందింది. లక్షలాది మంది స్వేచ్ఛగా, నిష్పాక్షికమైన ఎన్నికల ద్వారా తమ నాయకులను ఎన్నుకునే శక్తివంతమైన ఎన్నికల ప్రక్రియకు చాలా కాలంగా ప్రశంసలు పొందింది. అయితే, ఓటర్ల జాబితాలో అవకతవకలు, జెర్రీ మాండరింగ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు ట్యాంపరింగ్, సామాజిక సంక్షేమ పథకాల దుర్వినియోగం వంటి ఆరోపణలతో ఇటీవల ప్రజాస్వామ్య ఛత్రం సమగ్రతపై నీలినీడలు కమ్మేశాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష పార్టీలు లేవనెత్తిన ఈ వాదనలు, ఎన్నికల మైదానాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు అధికార బిజెపి క్రమబద్ధమైన పద్ధతిలో చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తున్నాయి. ఈ వ్యాసం ఈ ఆరోపణలను లోతుగా చర్చించి, భారత ప్రజాస్వామ్యంపై వాటి ప్రభావం, ఎన్నికల ప్రక్రియలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు చేయాల్సిన తక్షణ సంస్కరణలను పరిశీలిస్తుంది.ఈ వివాదానికి కేంద్ర బిందువు. పెద్ద ఎత్తున ఓటర్ల జాబితా తారుమారు జరిగాయనే ఆరోపణలు. 2025 ఆగస్టు 7న రాహుల్ గాంధీ విలేకరుల సమావేశంలోప్రత్యేక ఆధారాలు సమర్పించారు. బెంగళూరు సెంట్రల్ నియోజకవర్గంలోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌పై దృష్టి సారించిన రాహుల్, కాంగ్రెస్ పార్టీ పరిశీలన బృందం లక్షకు పైగా మోసపూరిత ఓటర్ల నమోదును వెలికితీసినట్లు పేర్కొంది. ఈ ఎంట్రీలను ఐదు రకాలుగా వర్గీకరించారు. నకిలీ ఓటర్లు లేదా చెల్లని చిరునామా గల ఓటర్లు, ఒకే అడ్రస్‌లో నమోదు చేసుకున్న బల్క్ ఓటర్లు, గుర్తించలేని ఫోటోలు ఉన్న ఓటర్లు, నకిలీలు, మొదటిసారి ఓటర్లను నమోదు చేసే ఫారం 6 దుర్వినియోగం. పేర్కొన్న ఉదాహరణలు ఆందోళనకరంగానే ఉన్నాయి. గుర్కీరత్ సింగ్ డాంగ్ అనే వ్యక్తి ఒకే చిరునామాలో ఓటరు జాబితాలో నాలుగు సార్లు కన్పించగా, ఆదిత్య శ్రీవాస్తవ అనే వ్యక్తి ముంబై, లక్నో, బెంగళూరులోని రెండు బూత్‌లతో సహా పలు నగరాలలో ఓటు వేసేందుకు నమోదు చేసుకున్నాడు.ఒక సందర్భంలో ఒకే గది ఉన్న ఇంట్లో 80 మంది ఓటర్లు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. ఒక ఓటరు చిరునామా, తండ్రి పేరులో మిస్టర్ డిఫోజ్ గైడ్స్ అనే అర్థరహితమైన పదం చేర్చారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటం 70 ఏళ్ల శకున్ రాణి అనే మహిళ కొత్త ఓటర్‌గా నమోదు చేసుకోవడం, రెండుసార్లు ఓటు వేసే అవకాశం లభించడం. ఈ ఆరోపణలు కర్ణాటకకే పరిమితం కాలేదు. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఆమ్ ఆద్మీపార్టీ(ఆప్), సమాజ్ వాదీ పార్టీ వంటి ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. మహారాష్ట్ర, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలలో ఇలాంటి ఆందోళనలు తలెత్తాయి. మహారాష్ట్రలో, 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల మధ్య కేవలం ఐదు నెలల్లోనే 39 లక్షల మంది అదనపు ఓటర్లను ఓటర్ల జాబితాలో చేరారని కాంగ్రెస్ ఆరోపించింది, ఐదేళ్లలో ఇంత పెద్ద ఎత్తున ఓటర్లు నమోదు కాలేదు.పశ్చిమ బెంగాల్‌లో, 2026 అసెంబ్లీ ఎన్నికలకు ముందు నకిలీ ఓటర్లను ఎన్నికల జాబితాలో అక్రమంగా చేరుస్తునారని, ముర్షిదాబాద్ జిల్లాలో 129 మంది ఓటర్లు, ఇతర రాష్ట్రాల ఓటర్లతో నకిలీ ఓటర్ల ఫోటో గుర్తింపు కార్డు నంబర్‌లను పంచుకుంటున్నారని టిఎంసి నాయకురాలు మమతా బెనర్జీ పేర్కొన్నారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన బాధ్యత భారత ఎన్నికల కమిషన్‌దే. (ఇసిఐ) అయితే ఇసి ఈ ఆరోపణలపై స్పందించకపోవడంతో తీవ్రవిమర్శలు ఎదురయ్యాయి. మహదేవపుర విషయంలో ఇసిఐ ప్రతిస్పందన, ఫాస్ట్ చెక్ చేయబడిన ట్వీట్, ఈ ఆరోపణలను పరిష్కరించడంలో విఫలమైంది. ప్రతిగా చర్య ప్రారంభించడానికి గాంధీ సంతకం చేసిన ప్రమాణ పత్రాన్ని సమర్పించాలని డిమాండ్ చేసింది. ఇసిఐ ప్రతిస్పందన పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.ఇది ఎన్నికల కమిషన్ నిష్పాక్షికత, పారదర్శకత పట్ల ప్రశ్నలను లేవనెత్తింది. ఆటోమాటెడ్ విశ్లేషణ ద్వారా లోపాలు గుర్తించడానికి వీలు కల్పించే యంత్రాలతో చదువగలిగే ఓటర్ల జాబితాను అందించేందుకు నిరాకరించడం మరిన్ని అనుమానాలను




రేకెత్తించింది. కాంగ్రెస్ మీడియా, ప్రచారవిభాగం చైర్మన్ పవన్ ఖేరా ఇసిఐ పేర్కొన్న నాన్ -మిషన్ రీడబుల్ పేపర్ రోల్స్‌ను ఏడు అడుగుల కాగితంగా అభివర్ణించారు. దాని పరిశీలన దాదాపు అసాధ్యం, కేవలం ఒక నియోజకవర్గం డేటా విశ్లేషణకే నెలలు పడుతుంది. ఓటర్ల జాబితా తారుమారుకి తోడు, గెర్రీమాండరింగ్ ఆరోపణలు ఆందోళనను పెంచాయి. ఒక పార్టీకి అనుకూలంగా నియోజకవర్గ హద్దులను తారుమారు చేసే పద్ధతి గెర్రీమాండరింగ్. ఎన్నికల్లో ప్రయోజనాలను పొందేందుకు అధికార బిజెపి ఈ సాధనాన్ని ఉపయోగిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల జాబితా అలాంటి అవకతవకలకు తోడ్పడే సాధనంగా గుర్తించారు. తమకు అనుకూలమైన ఫలితాలు రాబట్టేందుకు నియోజకవర్గాల రూపురేఖలు మార్చేందుకు బిజెపి వ్యూహాత్మకంగా కొత్త ఓటర్లను చేర్చడమో, తొలగించడమో చేస్తుందని ప్రతిపక్షనాయకులు ఆరోపిస్తున్నారు. ఉదాహరణకు, పశ్చిమబెంగాల్‌లోని బంగ్లాదేశ్ హిందూ శరణార్థులను, భాషా మైనారిటీల పేర్లను తొలగించేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని టిఎంసి పార్టీ ఆరోపిస్తోంది. గెర్రీమాండరింగ్ పార్టీలు పోటీపడే ఎన్నికల్లో ప్రభావం చూపుతుంది. అక్కడ ఓటర్ల జనాభాలో చిన్నమార్పు ఫలితాలను నిర్ణయించే అవకాశం ఉంటుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 33 వేల కన్నా తక్కువ ఓట్ల తేడాతో 25 సీట్లు గెలుచుకుందని రాహుల్ హైలైట్ చేశారు. తక్కువ సంఖ్యలో నియోజకవర్గాలను తారు మారు చేయడం ద్వారా పార్లమెంటులో మెజారిటీ పొందవచ్చునని సూచించారు. డీలిమిషన్ ప్రక్రియలో పారదర్శకత లేకపోవడం, ఈ సమస్య పరిష్కారానికి ఇసిఐ విముఖత చూస్తే, అధికార పార్టీ ఎన్నికల సరిహద్దులు తనకు అనుకూలంగా మార్చి, పాలనా ప్రక్రియపై తన ప్రభావం చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి.భారత ఎన్నికలలో ఇవిఎం ట్యాంపరింగ్ ఆరోపణలు ఎంతో కాలంగా వివాదాస్పదంగా మారాయి. ఈ మధ్య ఓటర్ల జాబితా తారుమారు కీలక అంశం అయింది. కాంగ్రెస్‌కు చెందిన ప్రవీణ్ చక్రవర్తి వంటి ప్రతిపక్ష నాయకులు ఇవిఎంల ట్యాంపరింగ్‌కు ఓటర్ల జాబితాలకు మధ్య తేడా గుర్తించారు. ఇవిఎంల ట్యాంపరింగ్‌కు కచ్చితమైన ఆధారాలు లేవు. జాబితా మోసంపై బలమైన ఆధారాలు కన్పిస్తాయి. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇవిఎంల గురించి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. అక్కడ మహాయతి కూటమి విజయం ప్రతిపక్షాలు, కార్యకర్తల్లో సందేహాలు రేపింది. సాయంత్రం 5.-30 గంటల నుంచి అకస్మాత్‌గా పెరిగిన ఓటర్లు, ఓటింగ్ డేటాలో తేడాలపై నివేదికలు ఆందోళనను పెంచాయి. పోలింగ్ స్టేషన్లలో సిసిటివి ఫుటేజీని 45 రోజుల తర్వాత తొలగించాలన్న ఇసిఐ నిర్ణయం అక్రమాలకు సంబంధించిన ఆధారాలు నాశనం చేసే యత్నంగా విమర్శలపాలైంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఈ వాదనలను ఖండించారు.ఇవిఎంలు ఫుల్ ప్రూఫ్ అన్నారు. పోలింగ్ ఏజెంట్లకు ఇచ్చిన ఫామ్ 17సి లోని నిబంధనలవల్ల ఓటర్ల ఓటింగ్‌లో తారుమారు అసాధ్యం అన్నారు. ఇసిఐ తిరస్కార ధోరణి, ధిక్కార స్వరం ప్రజల అనుమానాలను తీర్చలేకపోయింది. ఓట్ల లెక్కింపులో పారదర్శకతను నిర్ధారించే వివి పాట్‌లను విస్తృతంగా ఉపయోగించాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను ఎన్నికల కమిషన్ పట్టించుకోకపోవడం ఎన్నికల వ్యవస్థపై నమ్మకాన్ని క్షీణింపజేస్తోంది. ఓటర్లను

## టిడిపి ఏజెంట్‌లా డిఐజి కోయ ప్రవీణ్

అమరావతి,పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలకు జరుగుతున్న ఎన్నికలు ఎప్పుడూ జరగనంత ఘోరంగా జరుగుతున్నాయని వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. 2017లో నంద్యాల కంటే దారుణంగా ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.. మంగవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాల నుంచి టీడీపీ కార్యకర్తలు క్యూ లైన్లో నిలబడి ఓట్లు వేస్తున్నారని.. దొంగ ఓట్లు- వేసిన వాళ్ళ పేర్లతో సహా మా నేతలు వివరాలు తెలిపారన్నారు.. పోలీస్ యంత్రాంగం వైసీపీ నేతలను బూతుల దగ్గరకు రాకుండా అడ్డుకున్నారు.. మా పార్టీ ఎంపీ అవినాష్ రెడ్డిని అదుపులోకి తీసుకుని ఇష్టానుసారం తిప్పారని మండిపడ్డారు.. ఇవాళ ఖాకీ దుస్తులు వేసుకున్న సంగతి మర్చిపోయి టీడీపీ ఏజెంట్ లా ఎన్నిక జరిపే కార్యక్రమం డీఐజీ కోయా ప్రవీణ్ చేపట్టారని ఆరోపించారు. ఇంత దారుణంగా ఆయన ప్రవర్తిస్తుంటే సమాజం చూస్తూ ఊరుకుంటుందా..? అని ప్రశ్నించారు. పోలీసులు దొంగ ఓట్లు వేసే వాళ్లను అడ్డుకోకుండా వీళ్ళే తీసుకువెళ్లి వేయిస్తున్నారు.. పులివెందుల వైసీపీ కార్యాలయంలో అవినాష్ రెడ్డి కూర్చుంటే స్వయంగా డీఐజీ వెళ్ళారని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు.. మరో డీఎస్పీ నానా దుర్భాషాలు ఆడారని.. కార్యాలయం బయట ఉన్న జనాన్ని చెదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.. మీరు ఖాకీలు వదిలి పచ్చ చొక్కాలు వేసుకుని తిరిగితే బాగుంటు-oది.. నేను రాజకీయాల్లోకి వచ్చాక ఇలాంటి రాజకీయాలు చూడలేదని విమర్శించారు.. మీరు తీసుకువచ్చిన సంస్కృతి మిమ్మల్ని, మీ కొడుకును వెంటాడదా..? అని నిలదీశారు. చంద్రబాబు చరిత్ర హీనుడిగా మిగిలిపోతారు.. మీకు ఓటేసిన వాళ్లకు చంద్రబాబు ఎందుకు ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తు న్నారన్న భావన కలగదా..? అన్నారు. పోలీసులే ఎన్నికలు చేసే దుష్ట సంప్రదాయానికి శ్రీకారం చుట్టారన్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు వాళ్ళు విచ్చలవిడిగా పోలింగ్ కేంద్రాల్లో అక్రమాలు చేసుకునేందుకు అవినాష్ రెడ్డిని అడ్డుకుంటు-న్నారు.. చంద్రబాబు దగ్గర శెభాష్ అనిపించుకునే ప్రయత్నం చేస్తున్న డీఐజీ కోయా ప్రవీణ్.. దీనికి తప్పనీ సరిగా మూల్యం చెల్లించుకోకతప్పదు.. ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతుంటే మా ఓటు మాకు ఇప్పించండి అని జనం ఎందుకు పోలీసుల కాళ్లు పట్టుకుంటున్నారు.. మహిళలు తమ ఓట్ల కోసం ధర్నాలు చేస్తున్నారు.. అక్కడేం జరుగుతుందో రాష్ట్రం మొత్తం చూస్తున్నారు.. జమ్మలమడుగు వైస్ చైర్మన్ వచ్చి దొంగ ఓట్లు- వేసి వెళ్ళారు.. వైసీపీ కార్యకర్తలు బయటకు రాకుండా చేసి పోలీసుల సమక్షంలోనే దొంగ ఓట్లు- వేసుకున్నారని మాజీ మంత్రి అంబటి వ్యాఖ్యానించారు.

## ఆస్తిని రాయించుకుని తల్లిని గెంటేసిన తనయుడు

జోగులాంబ గద్వాల, సమాజంలో రోజురోజుకూ దుర్మార్గాలు పెరిగిపోతున్నారు. ఆస్తి కోసం కొందరు దుర్మార్గులు ఎంతకైనా తెగిస్తున్నారు. నవమాసాలు మోసిన కన్న తల్లినే కడతేర్చుతున్నారు. ఇలాంటి ఘటనలు ఇప్పటికే ఎన్నో జరిగాయి. తాజాగా మరో నీచమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆస్తి మొత్తం రాయించుకున్నాక.. కన్న తల్లికి ఎయిడ్స్ ఉందని కొడుకే పుకార్లు పుట్టించి ఇంట్లో నుంచి గెంటేశాడు. సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో చోటుచేసుకుంది. గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామానికి చెందిన హుస్సేన్‌బీ (80) పేరిట 8 ఎకరాల భూమి ఉంది. జీవిత కాలం దగ్గరుండి మరీ చూసుకుంటానని చిన్న కుమారుడు ఇస్మాయిల్ ఆమెను ఇంటికి తీసుకెళ్లాడు. కసాయి కుమారుడి మాటలు నమ్మిన హుస్సేన్‌బీ తన పేరుపై ఉన్న భూమిని కొడుకు ఇస్మాయిల్, కోడలు సాభేరాభాను పేరిట రాయించింది. రామాపురం శివారు, జూలకల్ శివారులోని భూమిని శాంతినగర్ తహసీల్దార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ కింద రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. హుస్సేన్‌బీ పేరిట ఉన్న మొత్తం భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాక కొడుకు ఇస్మాయిల్, కోడలు సాభేరాభాను ప్లేట్ మార్చారు. కొడుకు తల్లిని వేధించడం మొదలు పెట్టాడు. ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని ఎన్నో మాటలు అన్నాడు. చివరకు తల్లికి ఎయిడ్స్ ఉందని ప్రచారం చేసి ఇంటి నుంచి గెంటేశాడు. దాంతో గ్రామంలో ఆమెకు కనీసం ఎవరూ మంచినీరు కూడా ఇవ్వలేదు. సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు కె.మోహన్ రావు సాయంతో జిల్లా కలెక్టర్, ఎస్పీలను హుస్సేన్‌బీ ఆశ్రయించారు. తన రెండో కుమారుడు, కోడలు నమ్మించి మోసం చేశారని, తన బాగోగులు చూడటం లేదని, మానసికంగా కృంగదీశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన వద్ద ఉన్న తులం బంగారం, బ్యాంక్ ఖాతాలోని డబ్బు తీసుకున్నారని తెలిపారు. గిఫ్ట్ డీడ్‌ను రద్దు చేసి.. మళ్లీ తన పేరున భూమి నమోదు చేయాలని కోరారు. తన ఇంటిలో ఎవరూ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను హుస్సేన్‌బీ కోరారు. న్యాయం చేస్తామని కలెక్టర్, ఎస్పీలు ఆమెకు హామీ ఇచ్చారు.

## భారీ వర్షాంతో వరంగల్ అతలాకుతలం

వరంగల్, వరంగల్ జిల్లాలో మంగళవారం కుండపోత వర్షం కురిసింది. వరంగల్ నగరంలో వర్షం దంచి కొట్టింది. వరంగల్ నగరంలోని వివేకానంద కాలనీ, సాయి గణేష్ కాలనీ, శివనగర్, ఎన్టీఆర్ నగర్ కాలనీల్లోకి వరద నీరు భారీగా చేరింది. భారీ వర్షానికి గోకుల్ నగర్, శాంతి నగర్, కాలనీలకు ముంపు ముప్పు పొంచి ఉంది. కరీమాబాద్, రంగశాయిపేట, కాశీబుగ్గ ప్రాంతాలు మోకాళ్ల లోతు వరద నీళ్లలో కూరుకుపోయాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ప్రధాన రహదారులపై నీరు చేరడంతో వరంగల్ నగరంలో వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. లోతట్టు- ప్రాంతాల్లో ఇళ్లు, షాపుల్లోకి వరద నీళ్లు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. గడిచిన 12 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 92.9 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర సహాయం కోసం హెల్ప్ లైన్ నంబర్లు ఏర్పాటు- చేశారు

## మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

విశాఖపట్టణం,:మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఆవరించింది. బుధవారం నాటికి ఇది అల్ప పీడనంగా బలపడే అవకాశం ఉంది. ఆరు రోజులపాటు- ఏపీకి విస్తారంగా వానలు కురిసే అవకాశం ఉంది.. నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.. రేపు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి.. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లా రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు తీరం వెంబడి 40-50 కిమీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయి.. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ వెల్లడించింది..మరోవైపు అల్పపీడన ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో గత 5-6 రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. భారీగా వానలతో దాదాపుగా అన్ని జిల్లాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వరదలకు చెరువులు, జలాశయాలు నిండిపోయాయి. మరోవైపు రహదారులపై వరద చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. భారీ వర్షాలకు హైదరాబాద్ నగర వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. ప్రయాణికులు గంటల పాటు- ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నారు. హైదరాబాద్‌లో భారీ వర్షం పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా భారీ వర్ష సూచన నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తం అయ్యారు.

# గత ఆర్థిక సంవత్సరంలో 2.17 లక్షల ఫేక్ కరెన్సీ స్వాధీనం

న్యూఢిల్లీ, గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం 2.17 లక్షల ఫేక్ కరెన్సీ నోట్లను స్వాధీనం చేసుకున్నామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు– వేదికగా తాజాగా వెల్లడించింది. 2023–24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ సారి వీటి సంఖ్య కొద్దిగా తగ్గిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. మంత్రి ప్రకటన ప్రకారం, 1,17,722 నకిలీ రూ.500 నోట్లు–, 51,069 నకిలీ100 నోట్లు–, 32,660 ఫేక్ 200 నోట్లను కేంద్రం స్వాధీనం చేసుకుంది. ఇతర డినామినేషన్ల ఫేక్ కరెన్సీ నోట్లు– కూడా లభించాయి. ఈ మేరకు మంత్రి లోక్ సభలో లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రభుత్వం, ఆర్‌బీఐతో కలిసి, నోట్ల భద్రతా ఫీచర్లను తరచుగా సమీక్షిస్తుంటుందని కేంద్ర మంత్రి పంకజ్ పేర్కొన్నారు. అవసరమైన సందర్భాల్లో నోట్లకు కొత్త భద్రతా ఫీచర్లు జోడిస్తామని తెలిపారు. ఆర్‌బీఐ యాక్ట్ సెక్షన్ 25 ప్రకారం ఈ చర్యలు తీసుకుంటామని వివరించారు. నకిలీ నోట్లకు అడ్డుకట్ట వేసేందుకు ఇది నిరంతరంగా జరిగే ప్రక్రియ అని కూడా వెల్లడించారు. ఇక లోక్ సభ సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ దేశంలో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల స్థిర ఆస్తులు గత మూడు సంవత్సరాలుగా పెరుగుతున్నాయని అన్నారు. ఫిక్స్‌డ్ అసెట్స్ పెరిగాయని తెలిపారు. ఇక బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు 2021–22 ఆర్థిక సంవత్సరంలో 401 ప్రాజెక్టులను ఆమోదించగా, 2023–24 నాటికి ఈ సంఖ్య 944కి పెరిగిందని మంత్రి అన్నారు. మొత్తం ప్రాజెక్టుల వ్యయం ...1.4 లక్షల కోట్ల నుండి ...3.9 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. ప్రైవేట్ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మూలధన వ్యయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆర్థిక రంగ సంస్కరణలు, వ్యాపార నిర్వహణ సులభతరం చేయడంపై దృష్టి సారించామని పేర్కొన్నారు.

# కుక్కలను పూర్తిగా నిర్మూలించడం సరికాదు

న్యూఢిల్లీ, ఢిల్లీ, ఎన్సీఆర్‌లో వీధి కుక్కలను షెల్టర్లకు తరలించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భిన్నంగా స్పందించారు. రోజు రోజుకు మనం సైన్స్, మానవత్వం లేని ప్రాచీన యుగంలోకి వెళ్లిపోతున్నట్లు ఉన్నారు. మూగజీవాలైన కుక్కలు సమాజంలో పెద్ద సమస్య కాదని.. వాటిని పూర్తిగా నిర్మూలించడం సరైన చర్య కాదని అన్నారు. కుక్కల నుంచి ప్రజలకు భద్రత కల్పించాలనుకుంటే వాటికి స్థానికంగా షెల్టర్ల ఏర్పాటు, స్టెరిలైజేషన్, టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీధి కుక్కల అంశంలో 'సుప్రీం' ఆదేశాలను పునఃపరిశీలించాలని అభ్యర్థిస్తూ సినీ నటుడు అడివి శేష్ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌కు లేఖ రాశారు. ఈ విషయంలో ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా లేఖ రాసినట్లు– ఆయన వెల్లడించారు. తీర్పుపై ఇప్పటికే పలు జంతు హక్కుల సంస్థలు ఆక్షేపణ తెలిపాయి. కేంద్ర మాజీమంత్రి, జంతు హక్కుల కార్యకర్త మేనకా గాంధీ సైతం ఈ విషయన్ని లేవనెత్తారు. ఈ తీర్పు ఆచరణ సాధ్యం కాదన్నారు. ఢిల్లీలో 3 లక్షల వీధి కుక్కలున్నాయి. వీటికోసం 3 వేల షెల్టర్లు కావాలి. వీటి ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు–ఖర్చు చేసే పరిస్థితిలో ఢిల్లీ ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. ఢిల్లీ వీధుల్లో కుక్కల బెడద, కుక్కకాటు–, రేబిస్ వంటి కారణాల వల్ల మరణాలు పెరుగుతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేస్తూ.. కుక్కలను దూరంగా ఉన్న షెల్టర్లకు తరలించాలని సోమవారం సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కేంద్ర ప్రభుత్వ వాదనలు మాత్రమే వింటామని.. తమ ఆదేశాలకు వ్యతిరేకంగా జంతు ప్రేమికులు, ఇతర పార్టీలు, సంస్థలు వేసిన పిటిషన్లను విచారించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ప్రజాప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఈ ఆదేశాలు జారీ చేశామని ధర్మాసనం పేర్కొంది. వీలైనంత త్వరగా దిల్లీలోని అన్ని ప్రాంతాల నుంచి కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని అధికారులను అదేశించింది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

న్యూఢిల్లీ, దేశంలో పసిడి మంగళవారం ఉదయం నాటికి స్వల్పంగా తగ్గాయి. పెరిగినప్పుడు వేలల్లో పెంచుతున్న వారు తగ్గించేప్పుడు వందల్లో మమ అనిపిస్తున్నారు.ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ. 760 తగ్గి రూ. 1,02,420కి చేరుకుంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,890 వద్ద నిలిచింది. వెండి ధరలు మాత్రం స్థిరంగా ఉండి, ఢిల్లీలో కిలోగ్రాము వెండి రూ.1,16,900 స్థాయిలో ఉంది. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో మార్పులు ఉన్నాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (10 గ్రాములు) ధర రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి (1 కిలో) రూ. 1,26,900గా నమోదైంది. విజయవాడలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ. 1,26,900గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ.1,26,900గా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం రూ. 1,02,270.. 22 క్యారెట్ల బంగారం రూ. 93,740, వెండి రూ.1,16,900గా నమోదైంది. ఈ ధరలు ఢిల్లీతో పోలిస్తే కొన్ని నగరాల్లో స్వల్ప వ్యత్యాసాలను చూపిస్తున్నాయి. వెండి ధరలు హైదరాబాద్, విజయవాడ, చెన్నైలలో ఢిల్లీ కంటే ఎక్కువగా ఉన్నాయి. బంగారం ధరలు ఇటీవల ఆల్–టైమ్ గరిష్ఠ స్థాయిలకు చేరినప్పటికీ, మంగళవారం స్వల్పంగా తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్ బలపడటం, పెట్టుబడిదారులలో కొంతమంది లాభాలను బుక్ చేసుకోవడం కారనంగా చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు స్పాట్ గోల్డ్ రేట్లపై ఆధారపడి ఉంటాయి.డాలర్ బలపడటం వల్ల బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లపై అంచనాలు కూడా ఈ తగ్గుదలకు దోహదపడ్డాయి. భారతదేశంలో శ్రావణమాసం, పండుగ సీజన్ సమీపిస్తున్నప్పటికీ, కొంతమంది కొనుగోలుదారులు ధరలు మరింత తగ్గే అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. దీని వల్ల డిమాండ్ తాత్కాలికంగా తగ్గింది. వెండి ధరలు స్థిరంగా ఉండటం దీని పారిశ్రామిక వినియోగం, స్థిరమైన డిమాండ్‌ను సూచిస్తుంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం బంగారం ధరలు ఈ ఏడాది చివరిలో మరింత పెరిగే అవకాశం ఉంది.

# అంటువ్యాధులకు తోడు జ్వరాలు

ఏలూరు: వర్షాల సీజన్ కావడంతో ప్రజలకు అంటువ్యాధులు తప్పడం లేదు. దీనికితోడు ఇప్పుడు ఎక్కడ చూసినా ప్రజల జ్వరాలతో బాధపడుతున్నారు. వైరల్ ఫీవర్‌తో పాటు మలేరియా కూడా విజృంభిస్తోంది. నిగత కొద్దిరోజుల నుంచి అనేక గ్రామాల్లో దగ్గు, జలుబులు తీవ్రరూపం దాల్చడమే కాకుండా చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు వైరల్ ఫీవర్‌లుగా పేర్కొంటున్నప్పటికీ లక్షణాలు మాత్రం మలేరియా, టైఫాయిడ్‌లను పోలినట్లుగానే ఉంటున్నాయి. జ్వరాలు జనాన్ని భయానికి గురిచేస్తున్నాయి. వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికి పారిశుధ్య సమస్య కారణంగా వైరల్ జ్వరాలు విభృంభిస్తున్నాయంటున్నారు.

# బీఆరెస్ పక్కలో 'విలీన' బల్లెం! ముగ్గురు ముఖ్య నేతలకు కాల పరీక్ష!



హైదరాబాద్,బీజేపీలో బీఆరెస్ విలీనం అవుతుందా? ఇది మొన్నటి దాకా కాంగ్రెస్ ఆరోపణ. ప్రయత్నాలు జరిగాయని ధృవీకరించిన కవిత.. తన వద్దకే విలీనం ప్రతిపాదన తెచ్చారని బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ సంచలన ఆరోపణ.. సొంత ఇంటి నుంచే వచ్చిన ఆరోపణ.. రమేశ్ సంచలన ప్రకటనల నేపథ్యంలో బీఆరెస్ క్షేత్రస్థాయి వర్గాల్లో తీవ్ర గందరగోళం, కలవరం నెలకొన్నది. ఈ పరిణామాలు ఎటు దారి తీస్తాయన్న చర్చలకు అంతు ఉండటం లేదు. రజతోత్సవాలు జరుపుకొంటున్న రాజకీయ, ఉద్యమ పార్టీ బీఆరెస్.. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు 'విశ్వాస' పరీక్ష ఎదుర్కొంటోంది. నిన్నమొన్నటి వరకు ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ బట్టకాల్చి మీదేస్తోందిలే? అని కొట్టిపారేసిన 'బీజేపీతో విలీన అంశం' పార్టీకి పక్కలో బల్లెంలా మారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే అధికారానికి దూరమై, ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన కేడర్ స్థాయి వరకు చేరిన ఈ పార్టీ 'విలీన' అంశం.. తీవ్ర కలవరం సృష్టిస్తోంది. ఈ పరిణామాలు పార్టీ అధిష్ఠానంపై విశ్వాసం సన్నగిల్లేస్థితికి చేరిందనే చర్చ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకుల్లో సాగుతుంటే.. పార్టీ బలానికి గొడ్డలిపెట్టుగా మారుతోందనే ఆందోళన ఉద్యమకాలం నాటి నాయకుల్లో వ్యక్తమవుతోంది. రానున్న రోజుల్లో ఏ మలుపు తీసుకుంటుందోననే ఆవేదన కనిపిస్తోంది.

ఎన్నికలు ముందు నుంచి..

రాష్ట్రంలో రెండు పర్యాయాలు అధికారం చెలాయించిన బీఆరెస్ అధినేత మూడవసారి పీఠంపై కన్నేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంతోపాటు, కేంద్రంలో చక్రం తిప్పాలని భావించి టీఆర్ఎస్‌ను బీఆరెస్‌గా మార్చారు. దాదాపు ఎనిమిదేళ్ళ కేంద్రంలోని బీజేపీతో అంటకాగిన కేసీఆర్.. తర్వాత ఆ పార్టీని, ప్రధాని మోదీని వ్యతిరేకిస్తూ కయ్యానికి కాలు దువ్వారు. ఈ క్రమంలో వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో అధిష్ఠానం అంచనాలు తలకిందులు చేస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి, బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా మారిపోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకే ఎదుర్కొన్న పార్లమెంటు ఎన్నికల్లో 19 స్థానాల్లో ఒక్కటంటే ఒక్క స్థానాన్ని దక్కించుకోకపోగా, తమకు పెట్టని కోటల భావించే మెదక్ స్థానాన్ని సైతం బీజేపీకి సమర్పించుకోవడం రాజకీయ వర్గాలనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి లోనుచేసింది. మెదక్ స్థానంతో పాటు అనూహ్యంగా బీజేపీ ఎనిమిది స్థానాలు దక్కించుకున్నది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎంపీలు గెలువడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. అప్పుడే కొత్త చర్చకు దారితీసింది.

బీజేపీతో లోపాయికారి ఒప్పందం?

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తమ పాలనలో జరిగిన ఇబ్బందులపై ఆ పార్టీ వేధింపులకు పాల్పడుతోందనే అంచనా ఒక వైపు, అప్పటికే కేసీఆర్ బిడ్డ కల్వకుంట్ల కవిత ఢిల్లీ లిక్కర్ స్కాంలో నిందితురాలిగా ఉండటంతో ముందు జాగ్రత్తగా బీఆర్ఎస్ 'అధినేతలు' బీజేపీతో లోపాయకారి ఒప్పందానికి వచ్చారనే ప్రచారం ప్రారంభమైంది. నిప్పులేనిదే పొగరాదన్నట్లు పార్లమెంటు ఎన్నికల ఫలితాలు దీనికి తగ్గట్లుగా ఉండటంతో ఆరోపణలకు బలం చేకూరింది. ఇదే సమయంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తాము ఆశించిన స్థాయి స్థానాలు దక్కించుకోకపోవడానికి బీజేపీకి బీఆరెస్ చేసిన 'అవయవదాన'మే కారణమంటూ విమర్శలు గుప్పించింది. బీఆరెస్ తమ స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీతో కుమ్మక్కయిందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలో కవిత అరెస్టు, బీఆరెస్ నేతలు ఢిల్లీలో మకాం వేయడం తదితర వాటితో ఈ ప్రచారం జోరందుకున్నది. చీకట్లో కేటీఆర్, హరీశ్‌రావు బీజేపీ ముఖ్యనేతలను కలుస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ వచ్చారు. ఈ దశ వరకు కాంగ్రెస్ ఆరోపణలుగానే ఉన్నాయి.

కవిత ఎపిసోడ్‌తో బొక్కు బద్దలు

అట్టహాసంగా, కోల్పోయిన ప్రతిష్ఠను, పలుకుబడిని నిలబెట్టుకునేందుకు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని లక్షలాది మందిని తరలించి ఎల్కతుర్తి వేదికగా బీఆర్ఎస్ 25 సంవత్సరాల పండుగ చేసుకున్న విషయం తెలిసిందే. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకు నిర్వహించిన ఈ సభతో కేసీఆర్ కుటుంబంలో విభేదాలకు పాదులు పడ్డాయనే అభిప్రాయాలు తదుపరి పరిణామాలను గమనించిన విశ్లేషకులు వ్యక్తం చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో జైలు నుంచి బెయిల్‌పై కవిత విడుదలై వచ్చి రెస్టు తీసుకుంటున్నారు. ఈ దశలో జరిగిన సభలో బీఆరెస్‌లో కేసీఆర్ వారసుడిగా కేటీఆర్‌ను విస్పష్టంగా ప్రొజెక్ట్ చేశారు. దీంతో హరీశ్‌రావు, కవిత పైకి గంభీరంగా కనిపించినప్పటికీ.. వారి వర్గాల్లో కలవరం ప్రారంభమైందని పరిశీలకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కవిత 'లెటర్' రూపంలో పేల్చిన బాంబు లీక్ కావడం సంచలనంగా మారింది. ఈ లీక్‌పై స్వయంగా కవిత తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. కేసీఆర్‌ను తప్ప తాను మరొకరిని నాయకునిగా గుర్తించబోనని తేల్చిచెప్పారు. ఇదే సందర్భంలో తాను జైలులో ఉండగానే బీజేపీలో బీఆర్ఎస్ విలీనం ప్రతిపాదన చేశారంటూ కాంగ్రెస్ ఇంతకాలంగా చెబుతూ వచ్చిన బాంబు వత్తిని ముట్టించారు. అప్పటి వరకు కాసింత అనుమానాలున్నప్పటికీ కేసీఆర్ కుటుంబం నుంచే ఈ ఆరోపణ పేలడంతో బీఆరెస్ అధిష్ఠానంలో కలవరం షురూ అయ్యింది. ఈ ఆరోపణలను పరోక్ష పద్ధతిలో కొట్టిపారేసే ప్రయత్నం చేసినప్పటికీ కాంగ్రెస్ దీన్ని చర్చకు పెడుతూ వచ్చింది. ఈ అంశం తెరమరుగా కాకముందే కొద్ది రోజులకు మరో బాంబు పేలింది.

సీఎం రమేశ్ సవాల్‌తో కుండబద్దలు

కంచ గచ్చిబౌలి భూముల అంశంలో కోట్ల కుంభకోణం వెనుక బీజేపీ ఎంపీ ఉన్నారని కేటీఆర్ ఆరోపిస్తూ వచ్చారు. ఫ్యూచర్ సిటీలో సీఎం రేవంత్ బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు రూ.1600 కోట్ల విలువైన రోడ్డు పనులు కేటాయించారని కేటీఆర్ ఆరోపించారు. దీనిపై సీఎం రమేశ్ తీవ్రంగా ప్రతిస్పందించారు. కేటీఆర్‌కు సవాల్ విసిరారు. కవిత జైలులో ఉన్నపుడు బీఆరెస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు బీజేపీ పెద్దలు అమిత్‌షాతో మాట్లాడాలని కోరుతూ తన ఇంటికి వచ్చారని సంచలన ఆరోపణలు చేశారు. కావాలంటే కేటీఆర్ తన ఇంటికి వచ్చిన సీసీటీవీ ఫుటేజ్ సైతం ఇస్తానని చెప్పారు. దీనిపై బీఆరెస్ ఎదురుదాడి చేయడంతో మంత్రి బండి సంజయ్ జోక్యం చేసుకున్నారు. సీఎం రమేశ్ సవాల్‌కు కేటీఆర్ సిద్ధం కావాలని కేటీఆర్‌ను డిమాండ్ చేశారు. ఈ అంశాన్ని బీఆరెస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి తదితరులు కొట్టిపారేసే ప్రయత్నం చేశారు. సీఎం రమేశ్ అవకాశవాదంటూ విమర్శించారు.

బీఆర్ఎస్‌లో పెరిగిన కలవరం

కాంగ్రెస్ ఆరోపణలకు ఊతమిస్తూ కవిత విమర్శలు చేయడం తదుపరి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ ఏకంగా తన వద్ద ఆధారాలున్నాయంటూ సవాల్ చేయడంతో బీఆరెస్ అధిష్ఠానానికి విశ్వాస పరీక్ష ప్రారంభమైందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కింది స్థాయి క్యాడర్‌లో అనుమానాలు పెరుగుతున్నాయి. పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ.. పార్టీలో ప్రస్తుతం కవితను పక్కనపెడితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కాల పరీక్షను ఎదుర్కొంటున్నారన్న చర్చలు రాజకీయ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయి. సరైన సమాధానం చెప్పకుండా తిరిగి తెలంగాణ సెంటిమెంట్ పేరుతో, అధికార కాంగ్రెస్‌పై విమర్శల పేరుతో అసలు సంగతిని పక్కదోవపట్టిస్తున్నారనే అభిప్రాయాలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ ప్రభావం రానున్న రోజుల్లో ఎన్నికలపైన్నే కాకుండా పార్టీ నిర్మాణంపైనా కనిపిస్తుందన్న ఆందోళన పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నది. ఉద్యమ సమయంలో సైతం కేసీఆర్ అనేక అడ్డంకులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రస్తుతం ముప్పేట దాడి ఎదురుకావడం ఇబ్బందిగా మారిందని విశ్లేషకులు చెబుతున్నారు. పైగా స్వయంగా ఇంటి ఆడబిడ్డే విలీనం ప్రతిపాదనల అంశాన్ని బహిరంగంగా చెప్పడంతో దాన్ని సూటిగా కొట్టిపారేయలేని స్థితిలో బీఆరెస్ అధినాయకత్వం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రెడిబిలిటీ సమస్యకు తోడు ఇప్పటికే విద్యుత్ అవకతవకలపై వేసిన కమిషన్ రిపోర్టు ప్రభుత్వానికి చేరింది. తాజాగా కాళేశ్వరం కమిషన్ నివేదిక అందింది. మరోవైపు ఈ కార్ రేస్ కేసు కొనసాగుతోంది. ఈ స్థితిలో అటు అవినీతి, అక్రమాలు, కేసులు వెంటాడుతుండగా ఇప్పుడు పార్టీ ఉనికికి, అధిష్ఠానం విశ్వసనీయతకే పరీక్ష ఎదురవుతున్నదని రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై పార్టీ విధానం చర్చనీయాంశంగా మారింది.

# కార్పొరేట్లకు ఏజెన్సీ

హైదరాబాద్,అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంనాడు ఆదివాసీలకు రాజ్యాంగం, చట్టాలు కల్పించిన హక్కులకు పూచీ పడాల్సిన టిడిపి కూటమి ప్రభుత్వం, అందుకు విరుద్ధంగా ఏజెన్సీలో వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేసేందుకు వీలుగా పలు ఒప్పందాలు కుదర్చడం ఆదివాసీలకు అన్యాయం తలపెట్టడమే. దీనికి పాడేరు మండలం లగిసపల్లిలో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్న అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ సభ వేదిక కావడం అభ్యంతరకరం. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, జీవనోపాధి అవకాశాలు, అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్, పర్యాటకరంగ ప్రోత్సాహం పేరిట మోసగించడమే. ఎంఓయు కుదుర్చుకున్న టాటా, ఐటిసి, హాతీ, ఒయో, హెూమి హట్స్ వంటివి అంతర్జాతీయ, జాతీయ కార్పొరేట్ దిగ్గజాలు. ఈ సంస్థలు లాభాలు పోగేసుకునేందుకే వస్తాయన్నది జగమెరిగిన సత్యం. కాబట్టి గిరిజనుల ఉద్ధరణకు ఆస్కారం ఉండదు. అరకు కాఫీని దేశ, విదేశాల్లో బ్రాండింగ్ చేసేందుకు టాటా సంస్థకు గిరిజన కార్పొరేషన్ (జిసిసి)కు మధ్య ఎంఓయు కుదిరింది. అరకు కాఫీ అనేది ఆ ప్రాంత ఆదివాసీల హక్కు. ఆ పేరుతోనే బ్రాండింగ్ చేస్తే ఆదివాసీలకు, సదరు ప్రాంతానికి గుర్తింపు లభిస్తుంది. మధ్యలో టాటా ఎందుకో అర్థం కాదు. ఇందులో వ్యాపార మతలబు ఉందని తెలుస్తూనే ఉంది. ఆదివాసీలు పండించిన కాఫీని ప్రాసెస్ చేసి తమ బ్రాండ్ తగిలించుకొని ఎంచక్కా టాటా మార్కెట్ చేసుకుంటుంది. ఇక్కడ టాటాకు లాభం వస్తుంది తప్ప కాఫీని పండించిన గిరిజనులకు అదనంగా వచ్చేదేమీ ఉండదు. తేనె, కాఫీ, రాగుల వంటి అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం హాతి సర్వీసెసెస్‌తో, ఐటిసితో ఒప్పందాలు ఈ కోవలోకే వస్తాయి.మన్యం అనగానే ప్రకృతి ప్రసాదించిన అందాలు గుర్తొస్తాయి. పర్యాటకులను ఆకట్టుకుంటాయి. అరకు, లంబసింగి, మారేడుమిల్లి మూడు క్లస్టర్లతో గిరిజన పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామంటోంది సర్కార్. ప్రభుత్వం ఆధ్వర్యంలో టూరిజాన్ని ప్రమోట్ చేస్తే ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. ప్రైవేట్‌కు అప్పగిస్తేనే సమస్య. ఓయో, హెూమీ హట్స్ సంస్థలకు హెూంస్టేలను, హెూటళ్లను అప్పగిస్తే స్థానిక గిరిజనులకు ఒకటి అరా చిన్న చిన్న పనులు దొరుకుతాయంతే. లాభాలను ఆయా ప్రైవేటు సంస్థలే మూటగట్టుకుంటాయి. కూటమి సర్కార్ ఆవిష్కరించిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' పత్రంలో ప్రైవేటు టూరిజానికి పెద్ద పీట వేశారు. ఇటీవల జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో టూరిజం శాఖ పరిధిలోని అతిథిగృహాలను, హెూటళ్లను ప్రైవేటుకు అప్పగించేందుకు నిర్ణయించారు. అందులో భాగంగా ఏజెన్సీలో పర్యాటక




సౌకర్యాలన్నీ ప్రైవేటుపరం అవుతాయి. అటవీ ఉత్పత్తులకు ధర లేకుండా, కొన్ని వాటికి జిసిసి బకాయిలు చెల్లించని పరిస్థితులుండగా గిరిజనుల ఆదాయాలు మూడు రెట్లు ఎలా పెరుగుతాయో ప్రభుత్వమే చెప్పాలి. అభివృద్ధి పేరిట ఏజెన్సీలో ఆదివాసీలపై దాడి జరుగుతోంది. పోడు భూములను బలవంతంగా లాక్కుంటున్నారు. అడవులు, సహజ వనరులు కార్పొరేట్ల వశం అవుతున్నాయి. జాతీయ రహదారులు, పంప్డ్ స్టోరేజి ఇత్యాది ప్రాజెక్టుల్లో ఆదివాసీల హక్కులు హరించేలా వ్యవహరిస్తున్నారు. పోలవరంలో నిర్వాసితులవుతున్న లక్ష కుటుంబాల భవితను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నార్థకం చేశాయి. భూములనే కాదు వారి సంస్కృతిని ధ్వంసం చేసి ఆధిపత్య సంస్కృతిని బలవంతంగా రుద్దుతున్నారు. అభివృద్ధిలో 'డబుల్ ఇంజన్ సర్కార్' సంగతేమో, గిరిజన చట్టాలు, వారి హక్కులను కాలరాయడంలో కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని టిడిపి కూటమి పోటీ పడుతున్నాయి. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు నిబంధనలను, అటవీ హక్కులు, పీసా చట్టాలను మోడీ సర్కార్ నీరుగారుస్తుండగా, రాష్ట్రంలో 1/70 చట్టానికి తూట్లు పొడిచే చర్యలు సాగుతున్నాయి. ఏజెన్సీకి స్వయాన సిఎం వస్తున్నారనగానే, ఎన్నికల హామీ గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకే వందశాతం ఉద్యోగాలిచ్చే జిఒ 3ని పునరుద్ధరిస్తారని, స్పెషల్ డిఎస్‌సి ప్రకటిస్తారని యువత ఆశపడింది. ప్రత్యామ్నాయ మార్గాలు వెతుకుతామని సిఎం దాట వేసి నిరాశ పర్చారు. విద్య, వైద్యం, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలకు ఏజెన్సీ వాసులు దూరంగా ఉన్నారు. ఏజెన్సీలో డోలి మోతలు సరేసరి. సమాజంలో తతిమ్మా జనంతో సమానంగా ఆదివాసీలు అన్నిఅభివృద్ధి చెందితేనే నిజమైన అభివృద్ధి

# విద్యార్థుల మధ్య గ్యాంగ్ వార్

హైదరాబాద్,ఎల్బీనగర్‌లో విద్యార్తి గ్రూపుల మధ్య జరిగిన గ్యాంగ్ వార్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్లుగా సిసి కెమెరాల్లో నమోదు అయ్యింది. శుక్రవారం ఈ ఘటన జరగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొట్టుకున్న విద్యార్థులంతా అవినాష్ కాలేజీ వారుగా తెలుస్తోంది. ఒక గ్యాంగ్‌పై మరో గ్యాంగ్ దాడి చేసుకున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో రికార్డ్ అయ్యాయి. గ్యాంగ్ వార్‌పై ఎల్బీనగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. మొత్తం 15మందిపై ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. విద్యార్థుల మధ్య వాగ్వాదం జరగడానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై కాలేజీ నిర్వాహకులను పోలీసులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు ఘర్షణ పడుతుంటే కాలేజీ నిర్వాహకులు ఏం చేస్తున్నారని పోలీసులు ప్రశ్నించారు. అయితే ఘర్షణలో పలువురు విద్యార్థులకు గాయాలైనట్లు సమాచారం. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు పోలీసులు చెప్పారు. అయితే, కాలేజీ యాజమాన్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చదువు చెబుతారని తమ పిల్లలను కాలేజీకి పంపిస్తే కాలేజీ నిర్వాహకులు ఇలాగేనా ప్రవర్తించేదని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

# చందానగర్‌లో భారీ దోపిడీ

హైదరాబాద్, హైదరాబాద్ మహా నగరంలో ఓ జ్యువెలరీ షాపులో కాల్పులు జరిపిన దుండగులు భారీ దోపిడీకి ఒడిగట్టారు. చందానగర్‌లోని ఖజానా జ్యువెలర్స్ షాపులో కొంతమంది దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. ఒక్కసారిగా దుకాణం లోపలికి ప్రవేశించిన దొంగలు తుపాకులతో బెదిరింపులకు దిగారు. అక్కడున్న సిబ్బంది బెదిరించి పెద్దఎత్తున నగలు ఎత్తుకెళ్లారు. వారిని అడ్డుకునేందుకు సిబ్బంది ప్రయత్నించగా.. కాల్పులకు తెగపడ్డారు. షాపు డిప్యూటీ మేనేజర్ కాళ్లపై రెండు రౌడ్ల కాల్పులు జరిపారు దుండగులు. ఈ దాడిలో అతనికి తీవ్రగాయాలు అయ్యాయి. అనంతరం సీసీ కెమెరాలపైనా కాల్పులు జరిపారు. షాపు తెరిచిన 5 నిమిషాల్లోనే భారీ దోపిడీకి పాల్పడి అక్కడ్నుంచి కేటుగాళ్లు ఉడాయించారు. షాపు సిబ్బంది, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే, దోపిడీ అనంతరం దుండగులంతా జహీరాబాద్ వైపు పారిపోయినట్లు– గుర్తించారు. ఈ మేరకు జిల్లా సరిహద్దు పోలీసులను అలర్ట్ చేశారు. కాగా, నిందితులను పట్టుకునేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ సీపీ వెల్లడించారు. కెపిహెచ్‌బిలో దోపిడీకి పాల్పడిన ముఠానే ఖజానా జ్యువెలర్స్‌లోనూ కాల్పులు జరిపి దొంగతనం చేసినట్లు– తెలిపారు. 20 తులాల బంగారం, రూ.3లక్షలను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. కాగా, ఖజానా జ్యువెలర్స్‌లో భారీగానే గోల్డ్ చోరీ అయినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఎదురుతిరిగిన సిబ్బందిపై కాల్పులు జరిపారు. ఆరుగురు దుండగులు.. రెండు రౌండ్ల ఫైరింగ్ జరిపారు. తొలుత తుపాకీతో బెదిరించిన దుండగులు.. సిబ్బందిని లాకర్ కీ అడిగారు. వారు కీ ఇవ్వకపోవడంతో డిప్యూటీ– మేనేజర్‌పై కాల్పులు జరిపారు. లోపల బంగారు ఆభరణాలకు సంబంధించిన స్టాల్స్ విరగ్గొట్టి సిబ్బందిపై దాడులకు సైతం పాల్పడ్డారు. నగల దుకాణ సిబ్బంది భయంతో పోలీసులకు కాల్ చేశారు. ఈక్రమంలో అక్కడికి చేరుకున్న పోలీసులను చూసి దుండగులు పారిపోయారు. నిందితుల కోసం పది బృందాలను ఏర్పాటు–చేసి గాలిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు దొంగల ముఠా దుకాణంలో చొరబడిందని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. బంగారు ఆభరణాలు ఉన్న కౌంటర్లను దుండగులు తెరవలేకపోయారని పేర్కొన్నారు. వెండి ఆభరణాలు ఉన్న కౌంటర్లు ధ్వంసం చేసి వెండి వస్తువులు ఎత్తుకెళ్లారని తెలిపారు. వెండి ఎంత ఎత్తుకెళ్లారనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదన్నారు. బుల్లెట్ గాయమైన డిప్యూటీ– మేనేజర్ పరిస్థితి బాగానే ఉందని వివరించారు.

# మునీర్ ఒక పిరికివాడు...

న్యూఢిల్లీ,పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ ఒక పిరికివాడు.. పిరికివాడు కాబట్టే ఇలా అండ చూసుకొని మొరుగుతున్నాడు. ఇదే మొరుగుడు ఆపరేషన్ సింధూర్ సమయంలో జనాల మధ్యకొచ్చి మొరిగితే ఈ పాటికి ఈయన ఫొటోకు దండ వేసేవారు. భారత్ తో యుద్ధం వేళ కుటుంబాన్ని ప్రత్యేక ఫ్లైట్ లో లండన్ పంపించి.. ఒక బంకర్ లో దాక్కున్న పిరికివాడు ఇప్పుడు వాపు అయిన అమెరికాను చూసుకొని బలుపుతో మాట్లాడుతున్నాడు. మునీర్ అమెరికా గడ్డపై నుంచి ఇటీవల చేసిన ప్రకటనలు, ఆయన నాయకత్వ శైలి, వ్యక్తిత్వంపై చర్చకు దారితీశాయి. యుద్ధ సమయంలో ఆయన పారిపోయారన్న ఆరోపణలు, తన కుటుంబాన్ని లండన్‌కు పంపించారని వార్తలు, తాను ఒక బంకర్‌లో దాక్కున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు ఇవన్నీ మునీర్ నాయకత్వ సామర్థ్యం, మానసిక ధైర్యంపై సందేహాలు సృష్టిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే, అవి పాకిస్తాన్ సైనిక నాయకత్వానికి ఒక పెద్ద దెబ్బ.ఒక సైనిక నాయకుడు యుద్ధ సమయంలో భయపడి పారిపోవడం అనేది ఊహించలేని విషయం. అలాంటి చర్యలు సైన్యం యొక్క నైతికతను దెబ్బతీస్తాయి. సైన్యాధిపతి ప్రజల ముందు, సైనికుల ముందు ధైర్యంగా నిలబడాల్సిన బాధ్యత ఉంది. జనరల్ మునీర్ పాకిస్తాన్ యొక్క ఇంటెలిజెన్స్ ఏజెన్సీ %×ూ×% మాజీ అధిపతిగా పనిచేశారు. ఆయన కఠినమైన, నిష్పాక్షికమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కానీ, ఆయన ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, పాకిస్తాన్‌లో రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభం తీవ్రమయ్యాయి. ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం కూలిపోవడం, సైన్యంపై ప్రజల నమ్మకం తగ్గడం వంటి పరిణామాలకు మునీర్ కుట్రలు కుతంత్రాలే కారణం. ఈ సమయంలో మునీర్ నాయకత్వంపై ప్రజలలో, సైన్యంలో కొంత వ్యతిరేకత కూడా వచ్చింది. ఈ నేపథ్యంలోనే అమెరికా అండ చూసుకొని మునీర్ ఈ ఆరోపణలు చేయడం గమనార్హం.

మునీర్ పెద్ద మాటల వెనుక ఉన్న కారణాలు

గతంలో భయపడ్డారని ఆరోపణలు ఎదుర్కొన్న ఒక నాయకుడు ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం వింతగా అనిపించవచ్చు. అయితే, దీని వెనుక కొన్ని కారణాలున్నాయి. జనరల్ మునీర్ తన నాయకత్వ ప్రతిష్టను తిరిగి నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తుండవచ్చు. గత ఆరోపణలను మర్చిపోయేలా.. తాను దృఢమైన, దేశభక్తి కలిగిన నాయకుడిగా ప్రజల ముందు నిలబడడానికి ప్రయత్నిస్తూ ఉండవచ్చు. పాకిస్తాన్ ఆర్థికంగా, రాజకీయంగా సంక్షోభంలో ఉంది. అటువంటి సమయంలో భారతదేశం వంటి ప్రత్యర్థి దేశాలపై కఠినమైన వైఖరి చూపడం ద్వారా ప్రజల మద్దతు పొందడానికి ప్రయత్నిస్తూ ఉండవచ్చు. ఇది దేశంలో ఉన్న అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి ఒక మార్గం కావచ్చు. సైన్యాధిపతి ధైర్యంగా, యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటనలు చేయడం ద్వారా సైనికులలో నైతికతను పెంచడానికి ప్రయత్నిస్తుండవచ్చు.

–పాకిస్తాన్ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తు

జనరల్ మునీర్ నాయకత్వం కేవలం ఆయన వ్యక్తిగత ధైర్యం మీద మాత్రమే ఆధారపడి ఉండదు. పాకిస్తాన్ దేశం ఒక క్లిష్టమైన దశలో ఉంది. సైన్యం రాజకీయాలలో అధికంగా జోక్యం చేసుకుంటుందనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సైన్యాధిపతిగా ఆయన తీసుకునే ప్రతి నిర్ణయం దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది.మునీర్ నాయకత్వం నిజమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. ఉగ్రవాదం, ఆర్థిక సంక్షోభం, అంతర్గత రాజకీయ విభేదాలు, భారతదేశంతో సంబంధాలు వంటి అనేక సమస్యలు ఆయన ముందు ఉన్నాయి.

# ఆ కుటుంబమే కాంగ్రెస్‌లో చేరితే.. షర్మిలకు కౌంట్‌డౌన్!



అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ బలపడాలని ప్రయత్నిస్తోంది. అయితే వైఎస్సార్ కుమార్తె షర్మిలపై పెట్టుకున్న నమ్మకాన్ని, ఆమె వమ్ము చేసినట్టు ఆ పార్టీ అగ్ర నాయకత్వం గ్రహించింది. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలకు వ్యతిరేకంగా సొంత పార్టీ నుంచి భారీగా ఫిర్యాదులు వెళ్లినట్టు సమాచారం. గతంలో ఏ పీసీసీ అధ్యక్షులపై ఈ స్థాయిలో ఫిర్యాదులు వెళ్లలేదని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో షర్మిలకు ప్రత్యామ్నాయంగా బలమైన నాయకత్వ అన్వేషణలో ఆ పార్టీ అగ్ర నాయకత్వం వున్నట్టు తెలిసింది.ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో బలమైన కాంగ్రెస్ నేపథ్యం ఉన్న, అది కూడా పారిశ్రామిక కుటుంబంపై కాంగ్రెస్ అగ్ర నాయకత్వం దృష్టి సారించినట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఆ కుటుంబాన్ని కాంగ్రెస్‌లో చేర్చుకుంటే, ఖచ్చితంగా పార్టీకి ఏపీలో మంచి రోజులు వస్తాయని అగ్రనాయకత్వం బలంగా నమ్ముతోంది. ఇందులో భాగంగా ఆ కుటుంబంతో కాంగ్రెస్ అగ్ర నాయకులు సంప్రదింపులు జరుపుతున్నట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.వైఎస్సార్ కంటే, ముందు నుంచే కాంగ్రెస్ పార్టీతో ఆ కుటుంబానికి సన్నిహిత సంబంధాలున్నాయి. కాంగ్రెస్ నుంచి తండ్రీకూతురు కీలక పదవులు దక్కించుకున్నారు. నిఖార్సైన కాంగ్రెస్ సైనికులుగా పని చేశారు. పార్టీ కోసం ఆ కుటుంబం ఉపయోగపడిందే తప్ప, పార్టీని వాళ్లు వాడుకున్నారన్న చెడ్డపేరు లేదు. వైఎస్సార్‌తోనూ ఆ కుటుంబానికి సన్నిహిత సంబంధాలున్నాయి.అయితే వైఎస్సార్ మరణం, రాష్ట్ర విభజన తర్వాత %ౌ% ఆ కుటుంబం కాంగ్రెస్‌ను వీడింది. టీడీపీలో చేరింది. పదేళ్ల పాటు టీడీపీలో ఆ కుటుంబం కొనసాగింది. అనంతర రాజకీయ పరిస్థితుల్లో రాజకీయాల నుంచి ఆ కుటుంబం నిష్క్రమించింది. ప్రస్తుతం స్తబ్ధంగా ఉన్నప్పటికీ, మళ్లీ మూడోతరం రాజకీయ వారసుడు యాక్టీవ్ అయ్యే ఆలోచనలో ఉన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని, కాంగ్రెస్‌లో చేరితో, రాష్ట్ర నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.అయితే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్ వుంటుందా? వుండదా? రాహుల్ ప్రధాని అయ్యే అవకాశాలు ఏ మేరకు ఉన్నాయో ఆ కుటుంబం లెక్కలేసుకుంటోంది. ఒకవేళ ఆ కుటుంబం కాంగ్రెస్‌లో చేరితే మాత్రం%ౌ% షర్మిలకు కౌంట్‌డౌన్ మొదలైనట్టే. ఎందుకంటే, ఏ రకంగా చూసినా, ఆ కుటుంబం ముందు షర్మిల చాలా చిన్న నాయకురాలవుతుంది. ప్రస్తుతానికి షర్మిల కాంగ్రెస్ పాలిట ఆముదపు చెట్టు. ఆ కుటుంబం వస్తే, కాంగ్రెస్ పాలిట మహావృక్షమే.

# మోదీకి డేట్ దగ్గర పడుతుందిగా?

న్యూఢిల్లీ,భారతీయ జనతా పార్టీలో 75 ఏళ్లు నిండిన నేతలు క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవాలనే అనధికార నియమం కొత్తది కాదు. గతంలో ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్ జోషి, వెంకయ్య నాయుడు, జస్వంత్ సింగ్, యశ్వంత్ సిన్హా, సుష్మా స్వరాజ్ వంటి అనేక సీనియర్ నేతలు ఈ వయోపరిమితి కారణంగా సైడ్‌లైన్ చేయబడ్డారు. ఈ క్రమంలో 2025లో 75 ఏళ్లు నిండబోతున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భవిష్యత్తు గురించిన చర్చలు మళ్లీ తెరపైకి వచ్చాయి.మోదీ కేవలం బీజేపీ ప్రధాన నాయకుడు మాత్రమే కాదు. ఆయన పార్టీకి గెలుపు చిహ్నం. 2014, 2019, 2024 సాధారణ ఎన్నికల్లో మోదీ బొమ్మతోనే బీజేపీ వరుస విజయాలు సాధించింది. దేశవ్యాప్తంగా మోదీ వ్యక్తిత్వం, అభివృద్ధి అజెండా, జాతీయత భావజాలం ఓటర్లను ఆకట్టుకున్నాయి. ఈ కారణంగా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాలు సాధించగా, రాష్ట్రాల ఎన్నికల్లో మాత్రం స్థానిక నాయకత్వం బలహీనత కారణంగా పరాజయాలు ఎదుర్కొంది.

75 ఏళ్ల నియమం– మినహాయింపు సాధ్యమా?

బీజేపీ ఈ వయోపరిమితిని సీనియర్ నేతల పట్ల గౌరవంగా, కొత్త నాయకత్వానికి అవకాశం కల్పించడానికి అమలు చేస్తోంది. కానీ మోదీ సందర్భం వేరుగా ఉండొచ్చు. ఆయన వల్లే పార్టీ దేశవ్యాప్తంగా బలపడింది. 2029 ఎన్నికల వరకు మోదీని ముందుండనివ్వడం బీజేపీ వ్యూహాత్మక అవసరం కావచ్చు. ఆర్‌ఎస్‌ఎస్ కూడా మోదీని సులభంగా పక్కన పెట్టే అవకాశం తక్కువగానే ఉంది.

తదుపరి నాయకత్వ రేసు

ఎప్పటికైనా మోదీ తర్వాతి యుగం రావాల్సిందే. ఈ రేసులో ముఖ్యంగా ఇద్దరు పేర్లు వినిపిస్తున్నాయి. అమిత్ షా ,యోగి ఆదిత్యనాథ్. అమిత్ షా మోదీకి అత్యంత సన్నిహితుడు, ఎన్నికల వ్యూహకర్త, దేశవ్యాప్తంగా పార్టీ విస్తరణలో



కీలకపాత్ర. యోగి ఆదిత్యనాథ్ ఉత్తర ప్రదేశ్‌లో బలమైన హిందూత్వ ప్రతినిధి, పరిపాలనా కఠినత వల్ల జాతీయ గుర్తింపు.

–రాజకీయ భవిష్యత్తు

మోదీకి వయోపరిమితి కారణంగా పదవి నుంచి తప్పుకోవాల్సి వస్తుందా లేదా అనేది పూర్తిగా పార్టీ, ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహంపై ఆధారపడి ఉంటుంది. నియమాన్ని ఖచ్చితంగా పాటిస్తే మోదీకి రిటైర్మెంట్ సమయం దగ్గరగా ఉంటుంది. కానీ ప్రజా మద్దతు, ఎన్నికల విజయాల్లో మోదీ ప్రభావం దృష్ట్యా, ఈ నియమం ఆయనకోసం మార్చబడే అవకాశమూ ఉంది.

75 ఏళ్ల నియమం బీజేపీలో ఉన్నా, మోదీ విషయంలో ఇది కేవలం 'సాంకేతిక' అడ్డంకి మాత్రమే కావచ్చు. మోదీని తప్పించడం బీజేపీకి పెద్ద రిస్క్. కానీ ఆ రోజూ వస్తే, యోగి లేదా అమిత్ షా పార్టీని ముందుకు నడిపే అవకాశం ఉంది. మోదీ తర్వాతి బీజేపీ రూపు ఎలాంటి ఉంటుందనేది వచ్చే కొన్నేళ్లలోనే తేలిపోతుంది.

# కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం ఆదేశం



న్యూఢిల్లీ,నిర్ణీత శిక్ష పూర్తి చేసుకొని మరే ఇతర కేసులో దోషిగా లేదా నిందితులుగాలేని ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీం ఆదేశించింది. శిక్షాకాలం పూర్తి చేసుకున్న ఖైదీలు ఇంకా జైల్లోనే ఉండటంపై ఆందోళన సుప్రీం కోర్టు వ్యక్తం చేసింది.. వివిధ కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించి భారత సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. 2002లో ఢిల్లీలో నితీశ్ కటారా అనే వ్యాపారవేత్త హత్య కేసులో దోషిగా తేలిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ శిక్షాకాలం పూర్తయినందున అతడిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదే వైఖరి కొనసాగితే దోషి జైల్లోనే మరణిస్తాడని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా పహిల్వాన్‌ను ఇంకా జైల్లోనే ఉంచడంపై ప్రశ్నించిన ధర్మాసనం.. ఆయనతో సహా నిర్ణీత జైలు శిక్ష పూర్తయిన దోషులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. గడువుకు మించి ఇంకా ఎవరైనా దోషులు లేదా నిందితులు జైల్లోనే ఉన్నారా? అనే విషయాన్ని తెలుసుకోవాలని, తాజా తీర్పు కాపీలను అన్ని రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఢిల్లీలో 2002లో చోటుచేసుకున్న ఓ పరువుహత్య అప్పట్లో సంచలనం రేపింది. నితీశ్ కటారాను పెళ్లి మండపం నుంచే కిడ్నాప్ చేసిన సుఖ్‌దేవ్ పహిల్వాన్ బృందం అతడిని హత్య చేశారు. ఈ కేసులో సుఖ్‌దేవ్‌కు జీవితఖైదు పడింది. 2015లో ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు.. శిక్ష తగ్గింపు లేకుండా 20 ఏళ్లపాటు–జైల్లోనే ఉండాలని ఆదేశించింది. ఈ ఏడాది మార్చితో శిక్షాకాలం పూర్తికావడంతో తనను విడుదల చేయాలంటూ సుఖ్‌దేవ్ సుప్రీంను ఆశ్రయించాడు. విచారించిన సుప్రీం ధర్మాసనం సుఖ్‌దేవ్ పహిల్వాన్ అలియాస్ సుఖ్‌దేవ్ యాదవ్‌ను విడుదల చేయాలని జులై 29నే అదేశించింది. అయితే, అతడి ప్రవర్తనను విశ్లేషించిన శిక్షా సమీక్ష బోర్డు విడుదల చేసేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై సర్వోన్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. 20ఏళ్ల పూర్తయినందున పహిల్వాన్ విడుదల సాధ్యం కాదని, శిక్ష తగ్గించాలన్న అభ్యర్థనను ప్రభుత్వం అనుమతించినప్పుడే జైలు నుంచి బయటకు రాగలడని ఢిల్లీ ప్రభుత్వం చేసిన వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది.

# నగరంలో.. మరో మూడు బస్‌డిపోలు

హైదరాబాద్, కొత్త బస్‌డిపోల ఏర్పాటుపై గ్రేటర్ ఆర్టీసీప్రత్యేక దృష్టి సారించింది. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ కారణంగా శివారు ప్రాంతాల్లో కొత్తగా మూడు, నాలుగు బస్ డిపోల ఏర్పాటు దిశగా ప్రణాళికలు సిద్ధం చేసింది. డిపోల నిమిత్తం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఆర్టీసీకి స్థలాలు కేటాయించాలంటూ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.గ్రేటర్‌జోన్ పరిధిలో ప్రస్తుతం 25 బస్ డిపోలుండగా 3,043 బస్సులు నడుస్తున్నాయి. ఒక్కో డిపోలో 120 నుంచి 130 వరకు బస్సులు ఉండటం, ఈ ఏడాది చివరి నాటికి మరో 300 పైగా కొత్త బస్సులు వచ్చే అవకాశాలుండటంతో డిసెంబర్ నాటికి కొత్త డిపోలు ఏర్పాటు చేసుకోవాలని ఆర్టీసీ భావిస్తోంది. ఓఆర్‌ఆర్ చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలిస్తోంది. ట్రాఫిక్ కారణంగా ఉదయం,రాత్రి సమయంలో ఆర్టీసీ బస్సులు డిపోలకు చేరుకోవాలన్నా గంట నుంచి 2 గంటల సమయం వృథా అవుతోందని, శివార్లలో కొత్త డిపోలు ఏర్పాటుచేస్తే సమయం ఆదాతో పాటు ప్రస్తుతం ఉన్న డిపోలపై బస్సుల ఒత్తిడి తగ్గుతుందని సీనియర్ అధికారులు



చెబుతున్నారు. జిల్లాలకు ఆర్టీసీ నడిపే ఎలక్ట్రిక్ బస్సులకు రాత్రి సమయాల్లో శివారు డిపోల్లో చార్జింగ్ పెట్టుకునే సౌకర్యం ఉంటుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

# తెలంగాణ జాగృతికి బీసీని ప్రెసిడెంట్ చేస్తావా?

హైదరాబాద్,బీసీ రిజరేషన్లపై ఉద్యమిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవితకు ఇప్పుడు కొత్త చిక్కులు వచ్చిపడుతున్నాయి. బీసీల కోసం ఉద్యమించే మహిళా మణి ముందు తన జాగృతినుంచే బీసీలకు అందలం ఎక్కించవచ్చు కదా అన్న ప్రశ్నలు అన్ని వైపుల నుంచి వస్తున్నాయి. తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు రాజకీయ పార్టీల మధ్య తీవ్రమైన మాటల యుద్ధానికి దారితీస్తోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బీసీ రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తానని ప్రకటించగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆమె చిత్తశుద్ధిని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో, కవిత నాయకత్వంలో నడుస్తున్న 'తెలంగాణ జాగృతి' సంస్థ అధ్యక్ష పదవిని ఒక బీసీ నాయకుడికి ఇవ్వాలని పలువురు సవాళ్లు విసురుతున్నారు.

–కవిత ఆరోపణలు, హామీలు

బీసీ రిజర్వేషన్ల సాధన కోసం దీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్న కవిత, కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ బీసీలను మోసం చేయాలని చూస్తోందని ఆమె ఆరోపించారు. ఇటీవల పలువురు బీసీ నాయకులు, జాగృతి కార్యకర్తలతో సమావేశమైన ఆమె "రాహుల్ గాంధీ ప్రధాని అయిన తర్వాతే రిజర్వేషన్లు ఇస్తామని ఎన్నికల ముందు ఎందుకు చెప్పలేదు? పార్టీ పరంగా 42% రిజర్వేషన్లు కేవలం కంటితుడుపు చర్య'' అని విమర్శించారు. అంతేకాకుండా, బీసీ రిజర్వేషన్ల కోసం అఖిలపక్షాన్ని ప్రధాని వద్దకు ఎందుకు తీసుకెళ్లడం లేదని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. ఈ అంశంపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తానని కూడా కవిత హామీ ఇచ్చారు.

–బీసీ నేతలు, కాంగ్రెస్ కౌంటర్ అటాక్

కవిత వ్యాఖ్యలపై బీసీ నాయకులు, కాంగ్రెస్ నేతలు గట్టిగా ప్రతిస్పందిస్తున్నారు. "బీసీల పట్ల మీకు నిజమైన ప్రేమ ఉంటే, ఆ మాటలను ఆచరణలో చూపించండి" అని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిలో భాగంగా, కవిత అధ్యక్షురాలిగా ఉన్న



'తెలంగాణ జాగృతి' సంస్థకు ఒక బీసీ నేతను అధ్యక్షుడిగా నియమించాలని సవాల్ విసిరారు. బీసీలకు పెద్దపీట వేయాలన్న చిత్తశుద్ధిని ముందు తమ సొంత సంస్థలోనే కవిత నిరూపించుకోవాలని కాంగ్రెస్ నేతలు కోరుతున్నారు.

– రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం

రాజకీయ విశ్లేషకుల ప్రకారం.. బీసీ రిజర్వేషన్ల అంశం రాబోయే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలూ బీసీ వర్గాల మద్దతు కోసం పోరాడుతున్నాయి. ఈ క్రమంలో, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, తామే బీసీల పక్షపాతులమని నిరూపించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కవిత చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ తిప్పికొట్టడం, 'తెలంగాణ జాగృతి' అధ్యక్ష పదవిని ఒక బీసీకి ఇవ్వాలని డిమాండ్ చేయడం ఈ రాజకీయ పోరాటంలో ఒక కొత్త మలుపుగా మారింది.ఈ వాగ్వాదం బీసీ వర్గాల మద్దతును పొందడంలో ఏ పార్టీకి లాభం చేకూరుస్తుందో కాలమే నిర్ణయిస్తుంది. అయితే, బీసీ రిజర్వేషన్ల అంశంపై జరుగుతున్న ఈ చర్చ తెలంగాణ రాజకీయాల్లో వేడిని మరింత పెంచుతుందని చెప్పవచ్చు.

# రెండేళ్లయినా ఒక్క గుంత పూడ్చలే



హైదరాబాద్,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మెదడుకు నాలుకకు కనెక్షన్ కట్ అయ్యి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ వేముల ప్రశాంత్‌రెడ్డి ఘాటు– వ్యాఖ్యలు చేశారు. గత రెండు సంవత్సరాలలో ఆర్ అండ్ బి మంత్రిగా కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కొత్తగా ఒక గుంత పూడిచింది లేదు, ఒక్క ఇటు–క పెర్చింది లేదని విమర్శించారు. ఉట్టి మాటలు పిచ్చి వాగుడు తప్పిస్తే వెంకట్‌రెడ్డికి విషయంపై అవగాహన లేదని, కోమటిరెడ్డి కోతల రెడ్డిగా మారాడని విమర్శించారు. మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి విలేఖరులతో ఇష్టాగోష్టిలో చేసిన వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్ రెడ్డి ఘాటు–గా స్పందించారు. దుబాయ్ పోయి బోటు–లో షికార్లు చేయడం, ఎస్ఎల్‌బిసి పేరు మీద అమెరికా పోయి పార్టీలు చేసుకోవడం తప్ప వెంకటరెడ్డి ఈ రాష్ట్రానికి ఒరగబెట్టింది ఏమి లేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎల్‌బిసి కోమటిరెడ్డి తెలివి తక్కువ తనం వల్లే కూలిందని, ఇప్పటికీ చనిపోయిన వారి శవాలు కూడా బయటకు తీయలేని అసమర్థుడు అంటూ ఘాటు– విమర్శలు చేశారు. ఉప్పల్ – నారపల్లి ఫ్లై ఓవర్ పని కేంద్రం పరిధిలోని అనే జ్ఞానం కూడా వెంకట్ రెడ్డికి లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లయినా ఇప్పటికీ ఉప్పల్ ÷–లఫై ఓవర్ పని పూర్తి కాలేదని ప్రశ్నించారు. రీజనల్ రింగ్ రోడ్డు పనులు ఇంకా మొదలు కాలేదని అన్నారు. ఉత్తర భాగం రీజనల్ రింగ్ రోడ్డు ఆర్ఆర్ఆర్ పనులకు సంవత్సరం క్రితం –టె–ండర్లు పిలిచారని, నెల రోజుల్లోనే పనులు మొదలవుతాయని ఆయనే స్వయంగా అన్నారని, అయినా ఇప్పటికీ పనులు మొదలు కాలేదని, దీనికి వెంకట్‌రెడ్డి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. దక్షిణ భాగం ఆర్ఆర్ఆర్ విషయంలోనైతే ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని చెప్పారు. ఈ విషయాలు అసెంబ్లీ సాక్షిగా ఇదివరకే తాను చెప్పానని, వెంకట్‌రెడ్డి మరిచిపోతే రికార్డులు తెప్పించి చూసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం చేత కాకపోతే,మంత్రి పదవి నుండి తప్పుకోవాలని అన్నారు. ఇంకోసారి కెసిఆర్ మీద ఇష్టమొచ్చినట్టు– మాట్లాడితే నల్గొండ ప్రజలే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని పిచ్చాసుపత్రికి పంపిస్తారని పేర్కొన్నారు.

# లోక్‌సభను రద్దుచేసి..మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి

న్యూఢిల్లీ,గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అక్రమాలు చోటు–చేసుకున్నాయని పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తప్పులతో కూడిన ఓటర్ల జాబితాను ఉపయోగించే భాజపా అధికారంలోకి వచ్చింది. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు ఇలాగే ఎన్నికయ్యారు. లోక్‌సభను రద్దు చేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలి. అవసరమైతే నేను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నా. తృణమూల్‌తో పాటు– ప్రతిపక్ష ఎంపీలందరూ అందుకు సిద్ధమే' అని బెనర్జీ పేర్కొన్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఓటర్ జాబితాలు సరిగ్గానే ఉన్నాయని.. బెంగాల్, బిహార్‌లో మాత్రమే తప్పుగా ఉన్నాయని ఈసీ ఎలా చెబుతుందని ప్రశ్నించారు. బిహార్‌లో న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగితే భాజపా ఓడిపోతుందని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్‌ను నిర్వహించాలనుకుంటే ముందుగా లోక్‌సభను రద్దు చేయాలన్నారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్‌ను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనేందుకు విపక్షాలు ఆధారాలు కూడా చూపించాయన్నారు. ఎన్నికల సంఘాన్ని భాజపా ఎందుకు వెనకేసుకొస్తోందని ప్రశ్నించారు. భాజపా, కేంద్ర ఎన్నికల



సంఘం కుమ్మక్కయి ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కొద్ది రోజులుగా సంచలన ఆరోపణలు చేస్తున్నారు. 'ప్రజాస్వామ్యం వినాశనమైంది' పేరుతో ఇండియా కూటమి నేతలకు ఆయన ప్రజెంటేషన్ కూడా ఇచ్చారు. ఓటోరీకి వ్యతిరేకంగా ఒక వెబ్‌పేజీని ప్రారంభించి, అవకతవకలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అందులో భాగంగా సోమవారం విపక్షం నిరసన ర్యాలీ నిర్వహించింది.దీన్ని అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు ఎంపీలను అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత వారిని విడుదల చేశారు.

# బలోచిస్తాన్ పై అమెరికా నిర్ణయం వివాదం



వాషింగ్టన్,అమెరికా ప్రభుత్వం తాజాగా బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ దాని మిలిటెంట్ విభాగం మజీద్ బ్రిగేడ్‌ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది. ఈ నిర్ణయం అంతర్జాతీయంగా చర్చనీయాంశమవ్వడమే కాకుండా.. తీవ్ర విమర్శల పాలైంది. కారణం ఉగ్రవాదానికి ప్రధాన కేంద్రంగా ఉన్న పాకిస్తాన్‌ను పట్టించుకోకుండా.. దాని చేతిలో ఏళ్లుగా అణచివేతకు గురవుతున్న బలూచ్ స్వాతంత్ర్య సమరయోధులపై అమెరికా ఉగ్రవాద ముద్ర వేయడమే.

–బలూచ్ పోరాటం.. స్వాతంత్ర్యం కోసం...

బలూచిస్తాన్‌లో దశాబ్దాలుగా పాకిస్తాన్ సైన్యం, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు బలూచ్ జాతిని అణగదొక్కుతున్నాయి. మానవహక్కుల ఉల్లంఘనలు, అదృశ్యాలు, టార్చర్, నిర్బంధాలు అక్కడ నిత్యకృత్యంగా మారాయి. ఈ నేపథ్యంలోనే వంటి గుంపులు స్వాతంత్ర్య పోరాటం ప్రారంభించాయి. కానీ పాకిస్తాన్ వీరిని "ఉగ్రవాదులు''గా చిత్రీకరిస్తూ, అంతర్జాతీయ వేదికల్లో మద్దతు కోసం ప్రయత్నిస్తోంది.

–అమెరికా నిర్ణయం వెనుక రాజకీయ లెక్కలు

ట్రంప్ ప్రభుత్వం ఈ ప్రకటన చేయడం యాదృచ్ఛికం కాదు. గత కొన్నేళ్లుగా అమెరికా%–%పాకిస్తాన్ సంబంధాలు చల్లబడినా ఆఫ్ఘానిస్తాన్, చైనా, ఇరాన్ వంటి భౌగోళిక రాజకీయ అంశాల కారణంగా మళ్లీ సమీపం కావాల్సిన అవసరం వచ్చింది. పాకిస్తాన్ అనుకూల నిర్ణయాలు తీసుకోవడం, ఇస్లామాబాద్ కోపం తెప్పించకుండా చూడడం ఈ వ్యూహంలో భాగం కావచ్చు.

–బలూచ్ మద్దతుదారుల ఆగ్రహం

బలూచ్ ఉద్యమానికి మద్దతు ఇచ్చే అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు ఈ నిర్ణయాన్ని "అమెరికా పతనానికి పరాకాష్ట''గా అభివర్ణించాయి. పాకిస్తాన్ సైనిక దమనకాండను నిర్లక్ష్యం చేసి, దాని బలులైన బలూచ్‌లను ఉగ్రవాదులుగా ముద్ర వేయడం అన్యాయం అని వారు చెబుతున్నారు.

– ఇది ఎవరికీ లాభం?

పాకిస్తాన్‌కు తమ అంతర్గత సమస్యను అంతర్జాతీయంగా "టెర్రరిజం''గా ముద్ర వేయించుకోవడం పెద్ద విజయమే. కానీ అమెరికాకు తాత్కాలికంగా పాకిస్తాన్ సహకారం పొందవచ్చు కానీ, విశ్వసనీయతపై గీత పడుతుంది. బలూచ్ ఉద్యమానికి అంతర్జాతీయ వేదికల్లో వారి న్యాయమైన డిమాండ్ మరింత కష్టతరం అవుతుంది

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com